TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY
OU_204018
UNIVERSAL LIBRARY

ఆదర్శగ్రంథమాలాపుష్పము ౨.

# దేవిజోన్

గ్రంథకర్త:
ఆదర్శ గ్రంథమండలి సంస్థాపకులును
ఆర్యయువకసంఘాధ్యక్షులును నగు
గద్దె లింగయ్యచౌదరి

ఆదర్శగ్రంథమండలి,
ఎలమఱ్ఱు, కృష్ణాజిల్లా.

1931.

కాపీరైటు రిజిష్టరుడు]


వెల చందాదారులకు అ. 6.
ఇతరులకు అ. 8.

ప్రకాశకులు :
జి. ఎల్. చౌదరి,
సంపాదకుడు.
ఆదర్శ గ్రంథమండలి,
ఎలమర్రు.

మొదటి కూర్పు.

ముద్రాపకులు:
క. కోదండరామయ్యగారు,
ఆంధ్రగ్రంథాలయ ప్రెస్,
బెజవాడ.

# దేవి జోన



आहुति अपनी दे रही हूँ स्वदेश-अनुराग से ।
दहक उठेगा देश अब, स्वतंत्रता की आग से ॥

# సమర్పణము.

దేశసేవా తత్పరులై ప్రాణము తృణప్రాయముగ
నెంచి అద్వితీయ త్యాగబుద్ధికలిగి నిస్వార్థులై
అనూన ధైర్యసాహసోత్సాహములతో
ఆంగ్లేయుల నెదిర్చి
కారాగారవాసులై పలుకష్టము లనుభవించి
చివరకు దేశమాతకై ప్రాణమర్పించిన

**భారతవీరకుమారులకు**

ఈ పొత్తము నంచితభక్తిని
సమర్పించుచున్నాడను.

ఇట్లు,
గ్రంథకర్త.

## రాజపోషకులు

1 శ్రీ రాజా యార్లగడ్డ శివరామప్రసాద బహద్దరు
జమీందారుగారు, చల్లపల్లి.

2 శ్రీ గుమ్మడి శ్రీరామమూర్తి చౌదరిగారు,
భూస్వాములు, యలమర్రు.

3 శ్రీ కూటూరి సీతారామబ్రహ్మం చౌదరిగారు, యలమర్రు.

4 శ్రీ గద్దే పిచ్చయ్య చౌదరిగారు, యలమర్రు.

---

## పోషకులు

1 శ్రీయుత గొన్నూరి కోటినాగిరెడ్డిగారు, గుడివాడ.

2 శ్రీ అద్దేపల్లి సత్యనారాయణగారు, మండపల్లి.

---

## అభిమానులు

1 శ్రీయుత దాసరి వెంకటసుబ్బారావు చౌదరిగారు,
పచ్చలతాడిపర్రు.

2 ,, తుమ్మల రామకోటయ్యగారు, ముదునూరు.

3 ,, పర్వతనేని కృష్ణమూర్తిగారు, పోలుకొండ.

4 శ్రీయుత కావూరు పిచ్చయ్య చౌదరిగారు, దోసపాడు.
5 ,, కొండపల్లి వెంకట్రామయ్య చౌదరిగారు,
మంతెనవారిపాలెం.
6 ,, కోనేరు నారాయణరావుగారు, బార్లపూడి.
7 ,, కొల్లి వెంకయ్య చౌదరిగారు, అప్పికట్ల.
8 ,, మద్ది నారాయణగారు, యలమర్రు.
9 ,, గుళ్ళపల్లి పురుషోత్తమరావుగారు,
బ్రహ్మయ్య చౌదరిగారు, కురుమద్దాలి.
10 ,, సిరిపురపు వెంకటేశ్వరావుగారు, యలమర్రు.
11 ,, పొట్లూరి రంగారావుగారు, గుడ్లవల్లేరు.
12 ,, దుక్కిపాటి జగన్నాధరావుగారు, పెయ్యేరు.

# అభినందనము.

"ఆదర్శగ్రంథమండలి సార్థకనామముతో చిరస్థాయియై విలసిల్లుగాక" యని ఆశీర్వదించుచు మా యుద్యమమున కెల్ల విధముల ప్రోత్సాహమొనగూర్చుచు సాయమొనర్చుచున్న మ. రా. శ్రీ శ్రీ రాజా శివరామప్రసాద బహద్దరు జమీందారువారికి మా కృతజ్ఞతాభినందనముల నర్పించుచున్నాము. ఇట్టి స్వధర్మనిరతులకు సర్వేశ్వరుడు చిరతరాయురారోగ్య భాగ్యముల గూర్చుగాత!

—సంపాదకుడు.

# సంపాదకీయ భూమిక.

నేడు మీ కరకమలములయం దీపొత్తము నెంతయు సంతోషమున నుంచుచున్నాము. ఇట్టి జీవితములు నిజమున కాదర్శప్రాయములు. కాని మనయాంధ్రభాషయం దింకను జీవితచరిత్రము లరుదు. అట్టి కొరతను దీర్ప సమకట్టియే మా గ్రంథమండలినుండి జీవితచరిత్రములను బ్రకటింప బూనితిమి. నేడొక వీరనారీమణి జీవితచరిత్రము నర్పించితిమి. ఇంకను ఆదర్శప్రాయములగు జీవితచరిత్రములను అన్యగ్రంథములను నందియ్యగలమని విన్నవించుకొనుచున్నారము.

ప్రథమగ్రంథ మగు "బ్రహ్మచర్యము" నాదరించి మాకు ప్రోత్సాహ మొనగూర్చిన పాఠకమహాశయులు ద్వితీయగ్రంథమగు నీ "దేవి జోన్" ను గూడ నాదరించెదరని నమ్ముచున్నాము.

దేశభాషాభిమానుల సమాదర ప్రోత్సాహములు మాకెంత యెక్కుడుగనున్న నంత విరివిగ దేశభక్తి విలసితము లగు జీవితచరిత్రములను మతశాస్త్రగ్రంథములను బ్రకటింప మాకవకాశము గలుగునని మనవిజేయుచున్నారము.

మా యుద్యమమున కెల్లవిధముల సాయము చేయుచున్న శ్రీయుత పి. ఎస్. ఆచార్య, దాసరి వేంకటసుబ్బా

రావుచౌదరి, అద్దేపల్లి సత్యనారాయణగార్లకు మా కృతజ్ఞతాభివందనములు.

మా గ్రంథమండలియం దాదరాభిమానముల జూపుచున్న రాజపోషకులును, పోషకులును, అభిమానులును, చందాదారులును, భాషాభిమానులును నగు ఆంధ్రసోదరులెల్లరు దేశభాషాసేవలఁ జేయుచున్న ఈ గ్రంథమండలి కనవరతాభ్యుదయ పరంపరల జేకూర్చెదరుగాక యని నమ్ముచున్నారము.

గ్రంథము లచిరకాలములోనే జీర్ణించిపోక చిరకాలము నిలుచునట్లుగా నీ గ్రంథమును 36 పౌనుల ఆంటిక్ పేపరుపై గూడ ముద్రించితిమి. ఇక ముందు వెలువడు గ్రంథములన్నియు నిట్లే ముద్రింపింతుమని మనవి.

# తొలిపలుకు

ప్రియపాఠకమహాశయులారా!

హృదయపూర్వక వందనములు.

నాకు కొలదికాలమునుండి హిందీభాషనుండి యేవియైన జీవితచరిత్రములను ననువదింత మను కుతూహలము కలదు. కాని తగుప్రోత్సాహము లేమిచే ఆకోరిక నెరవేర్చుకొనజాలకపోతిని. అనంతరము గ్రంథమండలిని స్థాపించితిమి. స్థాపింపగనే ఏదేని జీవితచరిత్రము వ్రాసి ప్రకటింపదలంచితిని.

ఒకనాడకస్మాత్తుగ దేవీజోన్ అను హిందీగ్రంథమును జూచు భాగ్యము కలిగినది. వెంటనే ఆ గ్రంథమును అనువదింప నూహ పొడమినది. కాని గ్రంథము సాంగముగ జదువగనే యామెజీవితమును వ్రాయ మరికొన్ని యాంగ్లగ్రంథముల సాయమవసర మని తోచి, వెంటనే కొన్ని యాంగ్లగ్రంథములను దెప్పించి, కథను హిందీగ్రంథము నుండియు ప్రమాణములు ఆంగ్ల గ్రంథములనుండియు గ్రహించి, అనువాదమునకుగాక గ్రంథరచనకే గడంగితిని.

నేనిదివర కెట్టిగ్రంథమును రచించియుండలేదు. నేను కవినిగాను, పండితుడనుగాను. అయినను ఆదర్శపూరిత మగు ఆమె నిర్మలతేజోవికాసమే నన్నీకార్యమునకు బురికొల్పినది.


నేను విద్యావంతుడ గాకపోయినను అట్టి స్వాతంత్ర్యమూర్తి జీవితమును వ్రాయ సాహసించినందులకు పాఠకులు మన్నింతురుగాక. ఆమె విమలచరితమును నాకు దోచినరీతి సామాన్య భాషలో వ్రాసితిని. రచన యెటులున్నను జీవితము మాత్ర మాదర్శప్రాయముగదా!

పాఠకు లీజీవితమును చదివి జోన్‌యొక్క దైవభక్తి, పరోపకారబుద్ధి, స్వాతంత్ర్యలక్షణము, త్యాగదీక్ష మొదలగు విలసితములగు సద్గుణములను చవిచూచి యానందించెద రని యే నమ్ముచున్నాడను.

గ్రంథరచనకు బ్రోత్సాహపరచిన శ్రీయుత మోటూరి సీతారామబ్రహ్మం చౌదరి, గొన్నూరి కోటినాగిరెడ్డిగార్లకు నా వందనములు.

నా కిది యే ప్రథమయత్నమగుట గ్రంథమున దప్పులు కుప్పలుగా నుండవచ్చును. పాఠకమహాశయు లెల్లరు వానిని దయతో నాకు దెలియజేసిన రెండవ కూర్పున వానిని సవరించుకొందునని మనవి.

—గ్రంథకర్త.



గ్రంథకర్త.

# విషయసూచిక.


బాల్యము ౧

జననము 5

వంశపరిచయము - బాల్యము 7

తత్కాలీనఫ్రాన్సుదేశ రాజనైతికావస్థ 12

దేవవాణి స్వర్గీయదూతదర్శనము 15

మంత్రిదీక్ష ౨

సాధనపథవిఘ్నములు - వాని నివారణ 21

రాజాజ్ఞ - యుద్ధయాత్ర 31

యుద్ధక్షేత్రము ౩

అర్లింసునగరోద్ధారణాప్రయత్నము 37

యుద్ధయాత్ర 41

మంత్రిసాధనము ౪

అర్లింసునగరోద్ధరణ 47

అన్యయుద్ధములు - రాజ్యాభిషేకము 49

ప్యారిస్ నగరయుద్ధము - పతనపూర్వాభాసము 54

అంతిమయుద్ధము - జోన్ శత్రుహస్తగతము. 57

కారాగారమున ౫

జయిలుకథ 61

విచారణప్రహసనము 66

విచారణారంభము 70

అగ్నికుండమున జోన్ ౬

విచారణాంతము - మరణశిక్ష 91

అంతిమదృశ్యము ౭

వీరాంగనయొక్క ఆత్మత్యాగము 95

ఉపసంహారము ౮

ఆత్మోత్సర్గమునకు ఫలము 99

సంపూర్ణ ఫ్రాన్సునకు స్వాతంత్ర్య ప్రాప్తి 102

దేవీస్మృతిపూజ 104

వీరాంగననుగూర్చి మతామతములు 108

భగవంతుడా !

ఈ హిందూదేశమును శిరసావహించిన పాశ్చాత్యాచారములను, ప్రాచీనములను వదిలింపుము. భవ్యమగు సామ్రాజ్యమును అక్షరాస్యులై నడుపుచున్నది. కాని యింత సామ్రాజ్యమునకే ఆధిపత్యము కాక సామ్రాజ్యము నశింపజేయుము.

ఓ దాక్షిణ్య, దాస్యతాబంధనమును చూపవలదు.

నా కను పుణ్యభూమి దేశమును ముక్తినొందుము.

# దేవిజోన్

లేక

## స్వాతంత్ర్యమూర్తి.

# బాల్యము

## ౧

### —* జ న న ము *—

ఫ్రాన్సుదేశమున "లోరైన్" అనున దొకభాగము. ఈ భాగమందలి "డుమరిప్" అను గ్రామమున 1412 వ సం॥ లో నొకరైతుగృహమున తన దేశస్వాతంత్ర్యమునకై ఆత్మార్పణముచేసిన "జోన్ ఆఫ్ ఆర్క్" అను స్వాతంత్ర్య మూర్తి జననమొందెను. ఈ సమయమున ఫ్రాన్సుదేశము దాస్యశృంఖలాబద్ధమై యున్నది. ఫ్రాన్సున కుత్తరపశ్చిమ ప్రదేశములలో "కలే" నుండి "బోర్డో" వరకు "ప్యారిస్, రాయన్" మొదలుగాగల నగరములయందు ఆంగ్లేయవిజయ పతాకము లెగురుచుండెను ఆ సమయమున నింగ్లాండు రాజ సింహాసనమున "పంచమహెన్రీ" యాసీనుడై యుండెను. ఆకాలపు మూర్ఖులగు నాంగ్లసైనికు లక్కడక్కడ నుపద్రవ ములగు క్రూరకార్యములను జేయుచుండిరి. వారి యత్యా చారములవలన ఫ్రాన్సుప్రజలు భయకంపితు లగుచుండిరి. వారి యత్యాచారములును, ఔద్ధత్యములును ప్రజాగణము లను క్రూరమృగావాసమగు పర్వతారణ్యములలో దాగుకొను నట్లుచేసెను. గేహములను విడిచి యట్టి భయానకప్రదేశముల నుంటయే వారికి బ్రాణరక్షణోపాయముగ గనిపించెను.

ప్రజలు ఖిన్నవదనులును వ్యాకులచిత్తులునై యుండిరి. ఇట్టి సమయమందు వీరలలన యగు జోన్ జననమంది, తనయగణిత దేశబంధువులను దాస్యబంధమునుండి విడిపించి, యశోలతను విస్తరిల్లజేసెను. పదునారువత్సరములప్రాయముననే, యీ స్వాతంత్ర్యమూర్తి తనకరకమలమును స్వాతంత్ర్యఖడ్గముతో నలంకరించెను. దేశము దాస్యశృంఖలాబద్ధమై పలువిధముల బీడింపబడుచుండెను. ఆమె తన జన్మభూమికడ స్నిగ్ధహృదయముతో సెలవు గైకొనెను. మఱియు రణరాజితగౌరవహుంకారపూర్ణమగు సమరభూమియందు పదన్యాసము చేసెను.

తన దయనీయ దేశవాసుల దారిద్ర్యమును జూచిన నామెహృదయము చింతాకుల మగుచుండెను. ఆమె భగవత్ప్రేమనేగాక స్వదేశప్రేమనుగూడ కలిగిన స్వాతంత్ర్యమూర్తియై యుండెను. ఏనారీమణిని సత్యాభిమానసీయమైన వర్తమానకైస్త్రవజాతిలో బూర్వులు దేహమున ప్రాణముండగనే చితియందుంచి యగ్నికాహుతియొనర్చి తమపశుప్రకృతికి దార్కాణము జూపియుండిరో అట్టి వీరాంగన యొక్క యలౌకికచరిత్ర నానావిధగుణపాఠములతో బరిపూర్ణమై యున్నది. అట్టి వీరాంగనయొక్క అద్భుతకర్మమయ పవిత్రజీవనము, భగవద్భక్తి, స్వదేశప్రేమ మొదలుగాగల కారణములవలన నపూర్వశక్తిమయక్రీడాస్థలమై యొప్పారుచున్నది. ఆమె హృదయమున పురుషోచితదృఢత్వమును

సంకల్పసాధనాతత్పరతయును గూడియుండెను. ఆమె సహాన శక్తి గణనాతీతము. ఆమె విపత్సమయమున ధైర్యమును గలిగియుంటయు, సుఖదుఃఖసంపదాపద్హర్షవిషాదములను భగవంతునిమీాద దృఢవిశ్వాస ముంచి సహించుటయు వర్ణింప నేరితరము ?

౨

## —♦ వంశపరిచయము ♦—

దేవీజోన్ తండ్రి "జేకోబెస్ ఆర్క్" అను నతఁడు. అత డొక సామాన్యకృషీవలుఁడు. ఆమెమాత "యిసాబెల్లా." ఈమె ధర్మపరాయణతయును కర్తవ్యనిష్ఠయును గలిగిన రమణీమణి. ఈమె పుణ్యభూమియగు "రోము" ప్రదేశమును దర్శించి, "రోమిా" యను గౌరవనామమును పొందెను. ఆసమయమున రోముప్రదేశము క్రైస్తవుల ప్రధాన తీర్థ స్థానమై యొప్పారుచుండెను. అచ్చట ధర్మవీరుల సమాధిగణంబులు విరాజిల్లుచున్నవి. ఇందువల్లనే యాప్రదేశమును సందర్శించినవారలు "రోమి"యను గౌరవనామమును బొందుచుందురు. సోదరత్రియమును, నొక సోదరిని జోన్ కలిగియుండెను. అందరికంటె జిన్నది జోన్. "జోన్ఫిదేన్జా, 'జోన్ గార్సన్, జోన్ పేటిల్" మొదలగు క్రైస్తవ ధర్మావ

లంబులగు సాధుపుంగవు లాదినములందు ఫ్రాన్సు దేశములో విఖ్యాతి జెందియుండిరి. జోన్‌యొక్క పితరు లీ సాధు పురుషుల పవిత్రనామానుసారముగా తమ కనిష్ఠ పుత్రికా రత్నమునకు "జోన్" అని నామకరణము జేసిరి. ఆమె నా గ్రామవాసులు జేహానెట్ (Jehanette) అనియు, జిహాన్ (Jihanne) అనియు బిలుచుచుండిరి. ఆమెకు "కుమారీలాపు సేల్" అను పర్యాయనామముగూడ గలదు. ప్రజ లెక్కువగా నామెను జోన్ ఆఫ్ ఆర్క్ (Joan of Arc) అనియు "జియాండ్ ఆర్క్" (Jiyond Arc) అనియు బిలుచు చుందురు.

## బాల్యము.

దేవీజోన్ జన్మమందిన వంశము "ఆర్క్" అనునామ ముతో ప్రసిద్ధిజెందియుండెను. ఈ ఆర్క్‌వంశముననే "జోన్" పుణ్యశీలురగు తన పితరులయొడిలో లాలన బొందెను. ఆమె తలిదండ్రులజీవితమంతయు సరసమును, పవిత్రవంతమునునై యుండెను. ఇట్టి పుణ్యసంసర్గమునందుండి యీ దేవి శైశవా వస్థనుండియు భగవచ్చరణములయం దాత్మార్పణముచేయ నేర్చియుండెను. ఆమె యొక్కొకపుడు తండ్రితో పొలము నకు బోవుచుండెడిది. ఒక్కొకపుడు గృహకార్యములయందు దల్లికి సాయమొనర్చెడిది. మఱియు నప్పుడపుడు మాతృ సమక్షమున శిల్పకార్యములను నేర్చుకొనుచుండెడిది. మాతృ

ముఖమున "బైబిల్" ధర్మోపదేశములును ప్రాచీనవీరపురుషుల యాత్మోత్సర్గవిషయములును నాశ్చర్యజనకములగు గాథలును తఱచుగ వినుచుండుటచే నామె హృదయక్షేత్రమున స్వార్థత్యాగ లతాంకురము మొలక మెత్తి క్రమక్రమముగ వృద్ధియగుచుండెను. ఆమెకు ప్రాయము వృద్ధియగుకొలది విదేశీయ సైనికులయ మానుషాత్యాచారములవలన ఫ్రాన్సునివాసులు పీడింపబడుచుండి రని తెలిసికొనుచుండెను. కరుణామయి యగు నామె హృదంతరాళమున వ్యాకులత సంచరింప దొడగెను.

శస్త్రసహితులును, మూర్ఖులునునగు నాంగ్లసైనికుల యత్యాచారమువలన భయకంపితులై, తన యాశ్రయము నడిగిన యసహాయగ్రామవాసులను దన శక్తివంచన లేక విపదంబుధినుండి దరిజేర్చెడిది. ఒకసమయమున నామెనివాసభూమి యగు "డుమరెవ్" గ్రామమునే మదోన్మత్తులగు నాంగ్లసైనికు లాక్రమించిరి. ఆత్మరక్షణార్థము తద్గ్రామవాసులు గ్రామమును వీడి అడవి నాశ్రయించిరి. సైనికులు గ్రామమునుండి వెడలినపిమ్మట మరల గ్రామమునకు జను దెంచిరి. అగ్నికాహుతి గావింపబడిన ధర్మమందిరములును, గృహములును వారికంటబడెను. ఈ శోచనీయమగు దృశ్యములను గాంచి "జోన్" ఎంతయు జింతిలెను. జోన్ సహజముగనే దయార్ద్రహృదయయు, గోమలస్వభావయు నైయుండుటచే సాధుసేవచేయు టెంతయు నామెకిష్టము. గ్రామమునం

దేనికైన వ్యాధికలిగిన తత్క్షణమామె యచ్చోటికరిగి వారలకుపచారములు సేయును. ఆమె భగవంతునియం దమితభక్తియు స్వధర్మమునం దధికతశ్రద్ధయు గలిగి యుండెను. పాశ్చాత్యదేశములం దిట్టి శ్రద్ధాభక్తులుగలవారలు తక్కువగనే యుందురు. ఈశ్వరోపాసన నామె తన ప్రధానకర్తవ్యముగ దలంచును. ఆమె ధర్మమందిరముల నుపాసనావిధియందును, ధర్మవిషయికానుష్ఠానములయందును నత్యంత శ్రద్ధవహించుచుండెడిది. అప్పు డా గ్రామమునం దొక్కటేనియు విద్యాలయము లేకుండెను. అందువలన నామెకు విద్య నభ్యసింప నవకాశము లేకపోయెను. కాని మానవుడు యెట్టిభక్తితో నీశ్వరుని బొందగలడో మఱియు నెట్టి సచ్ఛీలముతో సచ్చరిత్రుడై యాదర్శజీవనము గడపగలడో అట్టి భక్తిశీలముల నామె శైశవమునుండియు గాంచియుండెను.

ఆమె యేకాంతవాసమునే యిచ్ఛగించెడిది. గృహసామీప్యమందలి పచ్చని మైదానమునందు గూర్చుండి విశాల నీలాంబరమును దూరస్థితాభ్రభేదియగు పర్వతమాలను, తరులతా పరిశోభిత నిర్జనవనభూమియొక్క ప్రకృతిసౌందర్యమును జూచి యామె యానందము ననుభవించుచుండెడిది. కాని యామె తలితండ్రు లీ నిర్జనవాసము నస్వాభావికముగా దలంచుచుండిరి. ఈ యల్పవయస్సుననే కాంతానురాగమును, సాంసారికవిషయములపట్ల నుదాసీనతను జూచి

వా రామెను తిరస్కరించుచుండిరి. జోన్‌కు వివాహముచేసి సాంసారికసుఖాధికారిణిగ జేయవలెనని వారు పలువాట్లు పడిరి. జోను యొక్క అసామాన్యరూపలావణ్యములను, పవిత్రచరిత్రమును, విమలభావమును, వినయస్వభావమును గ్రామవాసులగు యువకుల హృదయముల నాకర్షించెను. యువకు లనేకు లామెను వివాహమాడ బ్రస్తావించిరి. కాని యామె యెవరిప్రస్థావనను స్వీకరించి యుండలేదు. ఆమె పుణ్యవతియగు మేరీ (Virgin Mary) వలె ఆజీవితము బ్రహ్మచర్యవ్రతమును పాలింప నిచ్ఛగించెడిది. ఒకయువకుం డామెను పొందు కోరికతో ధనమదాంధుడై టౌల్ (Toul) ధర్మ విచారణాలయమున నభియోగమును నడపెను. అందు జోన్ తనతో వివాహమాడ ప్రతిజ్ఞ చేసినదనియు, కాని యిప్పుడు ప్రతిజ్ఞను నిర్వహించుకొనుట లేదనియు నుడివెను. అతని వాక్యముల విని "జోన్ శాంతిప్రియయు సుశీలయు మృదుస్వభావయు నగుట నీ యభియోగమున బ్రతివాదము గావింపక గృహస్థధర్మమును స్వీకరించు ననియు గాలక్రమమున నుదాసీనతను విడిచి సంసారమం దాసక్తిం బొందు" ననియు నెల్లరు దలంచిరి. కాని వారి తలంపు వ్యర్థమాయెను. "జోన్" విచారణాలయమునకు విచ్చేసి సుదృఢముగ నిట్లు చెప్పెను- "నాకు విరుద్ధముగ నడుపఁబడుచున్న యీయభియోగము కేవలము మిథ్యాకల్పిత మైయున్నది. నే నెప్పుడు

నేరితోడను వివాహప్రతిజ్ఞను జేసియుండలేదు."

న్యాయమూర్తి యామె సరళోక్తిని విశ్వసించి యా యభియోగమును త్రోసివేసెను. జోన్సుయొక్క జీవితాశయమునకు దారిక నుపట్టెను. ఇంకనేమి? యామె సంకల్పము దృఢమయ్యెను. పతితులగు స్వదేశవాసుల నుద్ధరించుకోర్కె ప్రబలమయ్యెను. కాని మనుష్యుడు గొప్ప యుద్దేశ్యసిద్ధి కొఱకు కఠోరసాధనాతత్పరు డగుచున్నాడు. అప్పు డతనికి పలువిధములగు విఘ్నము లెదురగును. దుర్బలచిత్తుడగు వ్యక్తి వానిని గాంచి భయపడును. కాని దృఢచిత్తుడును, నీశ్వర నిష్ఠాగరిష్ఠుడును నగువాడు సర్వవిధములైన విపజ్జాలమును ద్రెంచుకొని తన కర్తృత్వమునకు గడంగును. మఱియు మేఘముక్తుడగు భానునివలె ద్విగుణీకృతప్రకాశముతో నలంకరింపబడి జగత్తును ప్రకాశమానముగా జేయును.

## 3

### —* తత్కాలీన ఫ్రాంసుదేశ రాజ్యనైతికావస్థ *—

క్రీ॥ శ॥ 1415 సం॥లో నింగ్లాండురాజగు పంచమ హెన్రీ ఎగిన్‌కోర్టు యుద్ధములో *ఫరాసీయుల నోడించెను. తదుపరి రెండువత్సరములు జరిగినతరువాత ఫ్రాంసుదేశము

* ఫ్రాంసుదేశీయులు.

నాక్రమించి విజయముపొంది నార్మండీని పొందెను. ఆ సమయమున ఫరాసీయరాజులలో ఘోరమగు పరస్పరద్వేషము వ్యాపించియుండెను. ఈ పరస్పరద్వేషములలో బర్గండీ సర్దారగు జ్హోన్ అను నతడు ఒక పక్షనాయకుడై యుండెను. అతడు రాజకుమారుడగు "చార్లెస్ డఫిన్" మొదలగు నాయకుల సమక్షమున చంపబడెను. ఇందువలన నతని పుత్రుడు ఫిలిప్ క్రుద్ధుడయ్యెను. అతడు పితృహత్యకు బదులుగా స్వదేశమును జాతిని స్వార్థమును పదాహతము చేసి యాంగ్లేయులతో మైత్రిసల్పెను. ఇందువలన ఫరాసీయుల శక్తి తగ్గి యాంగ్లేయులశక్తి పెచ్చుపెరుగుట సంభవించెను.

ఆ సమయమున ఫ్రాన్సును ఆరవ చార్లెస్ పాలించుచుండెను. అతడు ఆంగ్లేయుల యీ సంయుక్తశక్తిని నిగ్రహించుకొనజాలకపోయెను. చివర కతడు 1420 సం॥లో నింగ్లాండున కధిపతియగు పంచమ హెన్రీతో సంధిసూత్ర మవలంబించెను. సంధిఫలితముగ ఫరాసీయ రాజకన్యక యగు కేథరిన్‌తో నింగ్లాండురాజునకు పరిణయమయ్యెను. మరియు ఫ్రాన్సుకు రాజు లేకపోవుటచే నతడే ఫ్రాన్సు కుత్తరాధికారి యయ్యెను. ఇందువలన నుత్తరఫ్రాన్సునం దధికాంశము ఇంగ్లాండురాజుయొక్క యధికారముననే యుండెను. కాని రాజకుమారుడగు డఫిన్ దక్షిణఫ్రాన్సులో నాంగ్లేయులకు విరుద్ధముగ దలయెత్తెను. మఱియు దనతండ్రి సిం

హాసనము నాక్రమించెను. అప్పు డాంగ్లరాజు, "డఫిన్"ను జయించుటకై మరల ఫరాసీయులకు విరుద్ధముగా యుద్ధయాత్రచేసెను. కాని యదే సమయమున 1422 సం॥ లో నతడు మరణించెను. ఫ్రాన్సురాజగు చార్లెస్‌కూడ నంతకుపూర్వమె మరణించియుండెను. పితృమరణానంతరము యువరాజగు ఆరవ హెన్రీ యాంగ్ల ఫ్రాన్సురాజ్యముల కధిపతి యాయెను. అతని పినతండ్రియే అతనికిబ్రతినిధిగ రాజ్యమును పాలించుచుండెను. డఫిన్ దుర్బలచిత్తుడు. అతడు దక్షుడును, చతుర శాసనకర్తయు నగు నాంగ్లపాలకు నెదిరింపజాలకపోయెను. ఇక్కడ స్వజాతీయులగు ఫరాసీయులుకూడ నిష్కపటస్వభావమున నతనిపక్షమును సమర్థించలేదు. అతని తల్లియగు ఇసాబెల్లా (Isabella) చరిత్రయందు బ్రజలకు సందేహము గలుగుటయే యిందుకు కారణము. డఫిన్ చార్లస్ పుత్రుడు కాడనియే వా రభిప్రాయపడిరి. ఇట్టి భిన్నకారణములవలన రాజ్యావస్థ శోచనీయమాయెను. భూస్వాములలో పరస్పర ద్వేషములు వ్యాపించెను. క్రూరసైనికగణములు వరుసగా గ్రామములను హింసించి దోచుకొనసాగిరి. ఈకారణముల చేత ఫ్రాన్సున నధికభాగము ఆంగ్లదాసత్వమును స్వీకరించెను. ఫ్రాన్సుదేశపు తత్కాలీనావస్థను వర్ణించుచు ప్రసిద్ధిజెందిన ఫరాసీయ ఇతిహాసలేఖకుడు లామర్టైన్ (Lamartine) యిట్లువ్రాసెను.

"........Thus the king seeking in vain his subjects amongest his people, the people vainly seeking their king in the monarchy; the Frenchman fruitlessly for his country France ; such was the state of the Nation."

"జనసామాన్యమున దనప్రజ లని చెప్పుకొనుటకు రాజున కెవ్వరును కనుపించ లేదు. ప్రజాగణమునకు దను స్వేచ్ఛాచారశాసనబాహుళ్యమువలన రాజును కనుపట్టలేదు. మఱియు ఫ్రాన్సువాసులకు స్వదేశ మని చెప్పుటకు పరదేశ మెంతమాత్రమును లేకపోయెను."

౪

— * దేవవాణి, స్వర్గీయదూతదర్శనము * —

స్వదేశీయ దయనీయబంధనదశను, సైన్యపీడితులును పతితులును నగు దేశవాసులబాధలు "దేవీ జోన్"కు దుర్భరముగ గన్పట్టెను. జన్మభూమియొక్క ఈ హీనచిత్ర మామె హృదయఫలకమున బ్రతిబింబింపసాగెను. "ఏవిధమున స్వదేశము దాస్యమునుండి దూరమగును? మఱి యేయుపాయమున విదేశీయుల యత్యాచారములనుండి స్వదేశీయులు తప్పించుకొందురు?" అను విషయములను గూర్చియే యామె దివారాత్రము లాలోచించుచుండెను. ఆమె నిర్జనవనమున

గూర్చుండి చింతాకులస్వాంతయై సర్వేశ్వరుని ప్రార్థన జేయును. మఱియు మనమున నిట్లు చెప్పుకొనును.

"ప్రభూ ! ఈ పతితదేశము నుద్ధరింపవా ? పీడితులగు నీ స్వదేశవాసుల దుఃఖమును దూరముచేయజాలవా ? మేము సదా ఈ దాసత్వరూపమగు నరకముననే పడియుండవలెనా ? భగవంతుడా! వీరికొరకు ముక్తిదాతను పంపవా ?

ఒకనాటివిషయము. గ్రీష్మఋతువు. సాయంసమయము. ఆమెకు ధర్మమందిరాంగణమున మైదానములో నకస్మాత్తుగ నొకకిరణము కనుపించెను. - ఒకక్షణానంతర మామెకొక దేవవాణి యిట్లు వినుపించెను. "జోన్ ! నీవు పవిత్ర చరిత్రవు. భగవానుని విశ్వసింపుము."

ఇదివిని యామె యాశ్చర్యాన్వితయాయెను. తరువాత కూడ నామెకు మఱియొకసారి యట్టిదేవవాణి వినుపించెను. అప్పటి కామె 15 వత్సరముల ప్రాయముగలది. కొంతకాలమునకు మరల నామెకు నిద్దరు స్వర్గదూతలు సువస్త్రభూషణాలంకృతులై దర్శనమిచ్చి యిట్లు చెప్పిరి.

"జోన్ ! డఫిన్ సహాయముకొరకు యుద్ధమున ప్రవిష్టురాలవు కమ్ము. మఱియు పతితస్వదేశము నుద్ధరింపుము."

విస్మయపూర్వకముగా జోన్ వారివైపు జూచి భయమున నిట్లనెను. " యుద్ధముచేయువిధానము నే నెఱుంగను. "

దూతవాక్యము - కేథరిన్ మార్గరెట్‌లు నీకు సహా

యము చేసెదరు.

ఆవాక్యములను జోన్ చాల శ్రద్ధతో వినెను. తరు వాతకూడ పలుసారు లామెకు స్వర్గీయదూతలదర్శన మైనట్లు ప్రతీతికలదు. దూతల యంతర్ధానసమయమున నామె యశ్రు పూర్ణనేత్రయై యావేశపూరితకంఠముతో నిట్లు అరచెడిది. "నన్నుకూడ దమవెంట" దీసికొనిపొండు.

జోన్ వినినదేవవాణి భగవద్వాణి. ఆమె పొందిన దూత లదర్శనము భగవద్దర్శనము. పశ్చిమప్రాంతీయప్రజలు దీనిని విశ్వసింపలేదు. కాని పూర్వప్రాంతీయులు సహజముగనే విశ్వ సించిరి. మనుష్యునికి భగవద్దర్శనము సంభవమను విషయమును జడవాదులగు పశ్చిమవాసులు విశ్వసింపరుకాని మన భార తీయులు సాధారణవ్యక్తులుగూడ విశ్వసింతురు. వ్యాకుల చిత్తులై భగవంతుని పిలిచిన దప్పక దర్శనము పొందెదరు. భోగవాసనలను త్యజించి యేకాగ్రచిత్తులై సాధించిన మాన వుని యవిద్య నశించును. మఱియు నంతర్హితమగు బ్రహ్మ మేలు కొనును. అప్పు డతడు తన యంతరాత్మయందే భగవద్ద ర్శనము పొందును.

---

# మంత్రదీక్ష.

౧

## —* సాధనపథవిఘ్నములు, వాని నివారణము *—

జోన్‌కు ప్రాప్తించిన దివ్యదూతలదర్శనవిషయము చాలదినములు దాగియుండ లేదు. క్రమముగా నీ విషయ మామె జననీజనకుల వీనులం జొచ్చెను. సరళస్వభావయు, శ్రద్ధాళువు నగు తల్లిహృదయకుహరమున నీ విషయము సహజముగనే యంకితమయ్యెను. కాని యామెతండ్రిమాత్రము విశ్వసింప జాలకపోయెను. అతడు ధర్మపరాయణుడు. ఇట్టిసంఘటన లసంభవమని తలంపడుగాని తన కుమార్తెవిషయమున విశ్వసింపలేకపోయెను. అతడు కన్యను తిరస్కరించుచు కర్కశ స్వరమున నిట్లనెను- "ఎప్పుడైనను నీ నోటినుండి యుద్ధమునుగూర్చి మాట వెలువడెనేని నిన్ను చంపెదను." తండ్రి రౌద్రమూర్తి యగుట గాంచియు ప్రతికూలసంభాషణము వినియు కోమలహృదయ యగు జోన్ చింతాకులస్వాంత యాయెను. ఒకవైపున తండ్రియొక్క కఠోరశాసనము. రెండవ వైపున పరాధీనయగు స్వదేశమాత యాకులాహ్వానము — ఈ పరస్పరవిరోధభావపు టనవరతాఘాతప్రతిఘాతములవలన నామెకరుణాప్రపూరితహృదయకమలము వ్యథితమై వాడిపోసాగెను. ఆమె తండ్రియాజ్ఞ నెరవేర్చు టెంత కర్తవ్యమో

అల్ప లక్షలకొలది దేశీయుల దుర్దశలను దూరపఱచుటకు దన యాత్మోత్సర్గ మొనరించుటకూడ నంత కర్తవ్యమని తలంచెను. కాని యామెకు రెండవకర్తవ్యమే గురుతర మాయెను. ఆమె చాలగ నాలోచించి పిత్రాజ్ఞాపాలనమున కంటె దేశరక్షణమే యధికమని నిశ్చయించి దేశమాతయొక్క యాహ్వానమునే అంగీకరించెను.

కాని తండ్రియాజ్ఞ నుల్లంఘించి బాహాటముగ యుద్ధ ములోనికి వెళ్లుట యామెకసంభవముగ గనుపించెను. కాబట్టి యామె యుక్తితో గృహత్యాగ మొనరింప నెంచెను. ఎండ్రి లాగ్జర్డు (Andre Laxart) అనునత డామెకు పినతండ్రి. ఆతనిభార్య జబ్బుపడియుండెను. కాబట్టి యామె పినతల్లి సేవయొనర్ప తండ్రియాజ్ఞనుపడసి యామె పినతండ్రినివాసమున కేగెను. ఆమెపినతండ్రి యుదారస్వభావుడు. ఇందువలన నామె తన మహాసంకల్పము నతనితో నివేదించెను. ఆమె దృఢసంకల్పమును విని యతడు ముగ్ధుడయ్యెను. జోన్‌వంటి యువతి విపత్పూర్ణమగు పవిత్రవ్రతమును బూనుటవిని యత డెంతయు సంతసించి తన శక్తివంచనలేక సాయముచేయు టకుగూడ నంగీకరించెను. ఈవిధముగా మిక్కిలి బుద్ధిమంతు డును ఆత్మీయుడు నగు పినతండ్రియాశ్రయము పొందుటవల న నామె యుత్సాహము శతవిధముల నధికమయ్యెను. ఆమె తన పినతండ్రిని వేకులియర్సు (Vaucauleurs) శాసన

కర్తయగు బౌడ్రికోర్టు (Baudri court) దగ్గరకు తన శుభ సంకల్పమును విన్నవింప నంపెను. కాని ఆయనురోధఫలము అన్యవిధమున పరిణమించెను. నిగర్వపర్వతాధిరూఢుడగు శాసనకర్త సామాన్యకర్షకకన్యసందేశము నున్మత్తప్రలాపముగా దలంచెను. మరియు నామె పినతండ్రితో నిట్లనెను- "ఆమెకు తెలియజెప్పి ఆమె తండ్రికడకు బంపివేయుము." ఆమె పినతండ్రి భగ్నమనోరథుడై వచ్చి సమాచారము నామెతో దెలిపెను.

పినతండ్రిముఖమున గర్వియగు శాసనకర్తయొక్క ప్రతికూలవాక్యముల విని చింతితయయ్యెను. కాని ముహూర్తమాత్రమైనను ఆమె నిరాశజెందలేదు. ఆమె స్వయముగ నతనికడ కేగి తన కోరిక తెలిపి యతని యుద్దేశ్యమును మార్ప సంకల్పించుకొనెను. పినతండ్రిని వెంటనిడికొని కాలినడకనే వేకులియర్సుకు ప్రయాణమాయెను. త్రోవయందు తన మాతృదేవతయొక్క సంభాషణములును, కరుణామయుడగు తండ్రి నిస్స్వార్థకరుణావ్యవహారములును, సోదర సోదరీమణుల ప్రీతివార్తాలాపములును, స్వగ్రామ శాంతిమయ ప్రకృతిచిత్రములును, జ్ఞప్తికి వచ్చి యామెను వ్యాకులపఱచుచుండెను. కాని యుత్తరక్షణమున వందనీయయగు స్వదేశజననియొక్క యశస్సిక్తవిషాదమయముఖకాంతి తలంచిన మోహమంతయు నశించి హృదయమున నభినవోత్సా

హాము సంచరింప దొడగెను. నగరమున బ్రవేశించి తనరా కను శాసనకర్త కెఱింగింప బినతండ్రిని బుత్తెంచెను. శాసన కర్త బాలికాసందేశమును విని యత్యంతవిస్మితుడయ్యెను. మరియు నామెతో సంభాషింప నిచ్ఛగించెను. జేవి శాసన కర్తసమక్షమున కేగి యథోచిత శిష్టాచార పూర్వకముగ నభివాదనము సలిపెను. నిరక్షరకుక్షియును, కర్షకబాలికయు నగు నామె వినయపూర్వకశిష్టాచారమును, దివ్యసుందరశరీరమును గాంచి శాసనకర్తయొక్క భావము మారెను. శాసన కర్త యామె నిట్లు ప్రశ్నించెను. "నీ వేల నన్ను కలిసికొన గోరితివి?"

జోన్—భగవంతుని పేరున రాజు కొక సందేశ మీయ నరుదెంచితిని. సందేశ మేమన "ధర్మయుద్ధమున వెనుకంజ వేయకుడు" అని.

శా.క.:— రాజకార్యములయందు నా కెంతమాత్ర మధికార ముండదు. రాజు నా యిష్టానిష్టముల ననుసరించి రాజకార్యనిర్వహణమును సాగింపబోడు. ఆయన సర్వస్వతంత్రుడు; నిరంకుశాధికారి.

జోన్:— ఈరాజ్యము నిజమునకు డఫిన్‌కు చెందినది కాదు. భగవంతుడే దీనికధికారి. కాని భగవంతునికోరిక యేమన "డఫిన్" రాజ్యభారమును గ్రహించి న్యాయ పూర్వకముగ రాజ్యమును శాసింపవలె ననుటయే. శత్రు

పక్షీయుల విఘ్నము లధికమైనను, అతనికి రాజసింహాస
నము లభించును. రీమ్సు (Rheims) నగరమున రాజ్యాభిషే
కోత్సవము జరుపుటకై ఈశ్వరుడు నన్ను నియమించెను.

శాసనకర్త బాలికయొక్క తేజఃపూరితవాక్యము
లను విని యాశ్చర్యాన్వితు డయ్యెను. ఈవిషయ మతిగురు
తరమని తలంచి యతడు ప్రధానధర్మయాజకునితో పరా
మర్శించెను. పిమ్మట ధర్మయాజకునితో నతడు జోనును
సమీపించెను. ధర్మయాజకుడు ధర్మశాస్త్రానుసారము యథా
రీతి నామెను బరీక్షించెను. పరీక్షానంతరము జోన్ అవశ్యము
ఈశ్వరానుగృహీతయనియు నీశ్వరప్రేరణముచేతనే యామె
యిల్లు గదలెననియు విశ్వసించెను. ఈసంగతి శీఘ్రమే నగర
మంతయు వ్యాపించెను. మఱియు గ్రామవాసులంద రామెను
దర్శింప రాసాగిరి. శాసనకర్త జోన్‌కు సంబంధించిన విషయ
ములను వ్రాసి డ్యూక్ ఆఫ్ లోరెయిన్ (Duke of Lorraine)
కు పంపెను. జోన్‌కూడ నాతనికడ కేగెను.

జోన్ డ్యూకుకడ కేగినప్పు డతడు మిక్కిలి రోగగ్ర
స్తుడై యుండెను. అతడు ఆమె సరళస్వభావమును పుణ్య
ప్రదీప్తముఖమును గాంచి ప్రసన్నుడయ్యెను. జోన్ వాస్త
వమున నీశ్వరాదేశముననే దేశోద్ధరణకు గడంగినదా యను
విషయమునుకూడ నతడు పరీక్షించెను. సంభాషణమున నామె
నిస్స్వార్థసేవాగుణమును తెలిసికొని భక్తిపరవశు డాయెను.

ఆమె యీశ్వరానుగృహీత యని నిండుమనమున విశ్వసించెను. ఆమె యతనికడ సెలవు పొంది పునః "వేకులియర్సు" నగరమునకు మరలెను.

డఫిన్ రాజుకూడ నీసంగతి వినెను. ఇచ్చట "జోన్" వాక్యములను సమర్థించుచు సభాసీనవ్యక్తులును, కులీన ప్రతిష్ఠితరమణీమణులును రాజుకడ కొక వినతిపత్రము నంపిరి. ఇందువలన రాజుధ్యానము విశేషరూపమున నామె నాకర్షించెను. ఆసమయమున రాజసభాసమావేశము చీనన్ నగరమున కూడుచుండెను. జోన్ రాజసముఖమునకు పిలిపింపబడెను.

ఈ సమాచారము లన్నియు నామె యాత్మీయజనగణము విని "వేకులియర్సు" నగరమున కేతెంచి యామెను యుద్ధములోనికి వెళ్ళుటను నిరోధింప ప్రయత్నింపసాగిరి. కాని జోన్‌కు యే విధముగను సంకల్పచ్యుతి కలుగలేదు. ఆమె వారికి వినయపూర్వకముగ నమస్కరించి యిట్లు చెప్పదొడగెను.

"జన్మభూమికి సేవజేయుటయే నా పరమకర్తవ్యము. ఆ మహాకర్తవ్యనిర్వహణముపట్ల నాత్మీయులగు మీ స్నేహమమత తుచ్ఛముగ భావింతును. ఇందువలన నేను నా భగవత్ప్రేరితకర్తవ్యము విడనాడుదాన గాను. ఇది నానిశ్చయము.

ఆమె యాత్మీయులు దుఃఖితులైరి. మాతృభూమి యొక్క కల్యాణవాంఛకై యాత్మీయజనముల హృదయము

లందు వజ్రిఘాతం బొనర్చి వారియాజన్మస్నేహమును తుచ్ఛ
ముగా తలంచుచుండెను. కార ఐహికసుఖమునకు తిలాంజలి నిడి
జోన్ నిర్భీతచిత్తమున మృత్యువును తన క్రీడాసహచరునిగ
నిశ్చయించుకొనెను.

సైనికజనోచిత వేషభూషణములతో సుసజ్జితయై నడు
మున తళతళమెరయు ఖడ్గము వ్రేలాడగట్టి జోన్ గుఱ్ఱము
నధిరోహించి సివన్‌నగరమునకు బయలువెడలెను. ఆమెను
చీనన్ నగరమునకు చేర్చుటకై మరికొందరామెవెంట నుండిరి.
"వేకులియర్సు" నుండి చీనన్ నగరము 450 మైళ్ళ దూర
ముండెను. మార్గము విపత్పూర్ణము. నగరము చేరుటకు
నాంగ్లేయుల ప్రదేశములను మర్గముపర్వతములను దాటవల
యును. జోన్ వీని నన్నిటిని దాటి యొకపక్షము దినములకు
చీననునగరము చేరెను. ఆమె యచట యుక్తసమయమున
రాజదర్బారును ప్రవేశించెను. అత్యైశ్వర్యయుతమగు
దర్బారును గాంచి యామె స్తంభితయయ్యెను. ఆమెను పరీ
క్షించుటకు రాజు తన రాజలాంఛనముల విడిచి మారువేస
మున మంత్రి యనుచరులమధ్య సామాన్యసామంతనృపాలుని
వలె నుండెను.

నిజముగ జోన్ భగవద్దర్శనము చేసియుండినచో నామె
తన నవశ్యము గుర్తింపగలదని తలచి యాతడట్లొనర్చె
ను. రాజసభలోగల విపులైశ్వర్యశోభిత రాజపురుషములనుండి

"జోన్" రాజును గుర్తించెను. మఱియు సభసికి నమస్కరించి "రాజా!" యని యాతని సంబోధించెను. ఛద్మవేషియగు రాజు "నేను రాజును కాను" అనెను. "జోన్" అంతతో విచలితకాక "మహామహిమాన్విత డఫిన్ విశ్వసామ్రాట్! పరమేశ్వరు దేవవాణిని మీకు విన్నవింపవచ్చితిని. మీరు నిర్భయులై వీరునివలె నింక రీమ్సునగరప్రయాణోన్ముఖులందగేరి సరులగుడనియే యీశ్వరాదేశము. అచట తమరాజ్యాభిషేకోత్సవము సకుశలముగ సంపన్నమగును."

"జోన్ రాజు నని న న్నెంతమాత్రము నెఱిగియుండలేదు. అయినను ఆమె న న్నెట్లు ఇందరిలో గుర్తింపగలిగెను?" అనునదియే రాజు నాశ్చర్యనిమగ్నుని జేసెను. అనంతర మాతని హృదయమున నామెయెడ శ్రద్ధాభక్తులు కలిగెను. ఆమె దైవశక్తిసంభూత యని యతడు నిశ్చయించుకొనెను. కాని రాజ్యహితైషులును, ధార్మికులును నగు వారి యభిమతము నెఱుంగక యామెను యుద్ధమునకు ముందుగ బంప సాహసింపజాలక యామెను పోటియర్సు (Potiers) నగరమునకు బంపెను.

అచట మహాసభ (Parliament) సమావేశమాయెను. శాస్త్రజ్ఞులు, మతాచార్యులు, విఖ్యాతరాజనీతిజ్ఞులు, ప్రతిభాశాలురగు న్యాయమూర్తులు, ఇంకను ననేకమంది ప్రజ్ఞావంతులు సభయం దుపస్థితులైరి. జోన్ వారి సమక్షమున

కేగెను. వా రామెకు నానావిధముల బ్రశ్నింపసాగిరి. ఒక డిట్లడిగెను.

"జోన్! పరమేశ్వరుడు ఫ్రాన్సును దాసత్వమునుండి విడిపించునుగదా! అయిన సేనతో నావశ్యక మేమి? యుద్ధము లేకయే దేశ ముద్ధరింపబడవచ్చునుగదా!

వారిమాటలకు "జోన్" ఎంతమాత్రము చలింపక తేజఃపూరితస్వరమున నిట్లు జవా బిచ్చెను.

"మనుష్యుడు కేవల కర్త. పరమేశ్వరుడు విధాత. మనము సశస్త్రసైన్యమును దీసికొని యుద్ధము చేసినయెడల పరమేశ్వరుడు మనను విజయగౌరవములతో గౌరవాన్వితుల జేయును."

ఇట్టి యుక్తిపూర్ణ మైనట్టియు, తేజఃపూరిత మైనట్టియు వాక్యముల విని యందరు బ్రసన్నచిత్తులైరి. కాని సెగోయిన్ (Seguin) అను పోటియను విశ్వవిద్యాలయాచార్యుడు "జోన్" యొక్క భగవద్దర్శనమును విశ్వసింపక యిట్లు ప్రశ్నించెను.

"నీవు వినినటువంటి దివ్యవాణి యేస్వరమునను౦డెను?"

జోన్ ఈప్రశ్నను విని విరక్త మనస్కయై యిట్లు తీవ్ర స్వరమున జవాబిచ్చెను.

"ఆస్వరము తమ కంఠస్వరము కంటె మధురముగను, ఇంపుగను నుండెను."

జోన్ ముఖమున నిట్టి జవాబును విని స్థైర్యచ్యుతుడయ్యు మరల నిట్లు ప్రశ్నించెను.

“నీవు నిజముగ నీశ్వర ప్రేరితవైనచో నేదైన నిదర్శనమును చూపుము.”

“జోన్” దృఢచిత్తముతో నిట్లు చెప్పెను.

“నిదర్శనములు చూపుటకై నే నిచటకు వచ్చియుండలేదు. సేనను నాపరము చేసి న“ఓర్లియంస” నగరమునకు పంపుము. త న్నగరోద్ధరణయే నాదివ్యశక్తికి నిదర్శనము.”

ఈవిధముగ తర్క-వితర్క-విమర్శానంతరము సభ్యగణము “జోన్‌కు” అనుకూలమైరి. ఆమెకు భగవద్దర్శనము సంభవమే యని తలంచి యామెను యుద్ధమునకు బంపనిశ్చయించిరి. “జోన్” విషయములో వారు నిర్ణీతవాక్యత్రయమును రాజుకడకు వ్రాసి పంపిరి.

(౧) క్రైస్తవధర్మమందు “జోన్” గాఢశ్రద్ధయు నిశ్చలభక్తియు కలిగియున్నది.

(౨) ఆమె యీశ్వరాదేశమును బొందియే దేశోద్ధరణకు గడంగినది. ఇందు విశ్వసింపదగనివిషయ మెంతమాత్రము లేదు. ఎందుచేత నన భగవత్కృపచే నంతయు సంభవమై యున్నది.

(3) జన్మభూమి నుద్ధరించుపట్ల రమణికూడ పురుషవేషమున యుద్ధముచేయుట కధికారిణియై యున్నది.

౨

## —* రాజాజ్ఞ - యుద్ధయాత్ర *—

పోటియర్సు ప్రాగ్రమోటరుయొక్క యీ యనుకూల తీర్మానమును బొంది రాజెంతయు సంతసించెను. అతడీ క్రింది విజ్ఞప్తిని తన రాజ్యమంతటను ప్రకటించెను.

"ఫ్రాన్సుదేశమును విదేశీయుల దాస్యశృంఖలములనుండి విడిపించి రాజును ఫ్రాన్సుసింహాసనాధిష్ఠితుని జేయుటకై కుమారి జోన్ ఆఫ్ఆర్కుకు ఈశ్వరుడు ఆదేశమిచ్చియున్నాడు. ఈ విషయ మామెయే స్వయముగ జెప్పుచున్నది. రాజు స్వయముగ నామెను పరీక్షించెను. ఆమె చరిత్రవిషయములో ప్రకటాప్రకటరూపములతో ననుసంధానము చేయబడినది. అందువలన నామె పునీతచరిత్రయు, ధర్మపరాయణయు, ఈశ్వరనిష్ఠయు, నరళహృదయయు, సత్యవాదినియు నని ధ్రువమగుచున్నది. సుప్రసిద్ధధర్మశాస్త్రజ్ఞులును, రాజనీతికోవిదులును, ప్రతిభాశాలురగు నాచార్యులును ఈమెను పరిశీలించి యనుకూలాభిప్రాయము లిచ్చుచు నామెను యుద్ధములోనికి బంప నంగీకరించిరి. విశేషముగ నీమె జన్మవృత్తాంత, జీవిత, కార్య, కలాపముల విషయములో ననేక అలౌకికఘటనలు తెలియవచ్చుచున్నవి. ఇందువలన రాజామెను యుద్ధమునకు బంప నిశ్చయించెను.

ఆమెవలన రాజ్యమునకు గొప్పకళ్యాణ మొనగూడునని కూడ రాజు విశ్వసించియున్నాడు."

ప్రజ లీ వినతిపత్రమును చదివి ఆనందాబ్ధిలోనోలలాడిరి. ఉచ్చపదస్థులు, సమరతత్వవేత్తలు నగు వీరపురుషులు 'జోన్'కు ప్రతిదినము యుద్ధవిద్య నేర్పదొడంగిరి. కొలది దినములలోనే ద్వంద్వయుద్ధమున, వ్యూహరచనమున, అన్య సమరనీతి సంబంధవిషయములలోను జో నెంతయు నైపుణ్యమును సంపాదించెను. తదనంతర మామె యుద్ధమునకు వెళ్లుటకై సిద్ధమయ్యెను. ఆమె శరీరమంతయు తెల్లని చర్మమును ధరించెను. ఆమె నడుమున నొకవైపున పంచవిధచిహ్నములు గల * కృపాణమును, రెండవవైపున లోహనిర్మితమైయొప్పు తీక్ష్ణకఠారియు వ్రేలాడుచుండెను. హస్తమున నిష్టదేవత యగు యీ సామనీమాయొక్క నామాంకితమగు శ్వేతపద్మ చిహ్నితపతాకమును ధరించెను. ఇదే విధముగ విచిత్రరంగో చితవేషముతో సుసజ్జితయై యొక యుచ్చాశ్వము నధిష్ఠించి సేనాసమేతయై బ్లోయిస్ (Blois) నగరమునకు బయనము సాగించెను. అచట పలువురు నారీమణు లామెకు సుస్వాగత

---

* ఈకృపాణము జోన్‌యొక్క నిర్దేశానుసారము ఒక ధర్మమందిర మందలి వేదిక వెనుకభాగమున భూమిలోపలనుండి తీయబడినది. ఈ విషయమున "జోన్" ఇట్లు చెప్పెను- "నేను దేవవాణి సహాయమున నీ కృపాణ విషయమును తెలిసికొనగలిగితిని.॥

యిచ్చిరి. ఈశ్వరప్రేరణయందలి విశ్వాసముతోను, పూత చరితయగు వీరాంగనయొక్క శుభాగమనముతోను, పరాధీన ప్రజల నిరాశాపూరిత హృదయములు, ఆశయను నవీనాలోకముచే సుద్భాసితములై దుఃఖితములగు సేనాదళములందు నవజీవనము సంచరింపదొడగెను. ఎల్లెడల నానందోత్సాహములే వ్యాపించియుండెను.

“జోన్” ప్రప్రథమమున సైనికుల చరిత్ర సంశోధనమునకు ధ్యానముంచెను. ఆమెయాజ్ఞానుసారము సైనికులందు ద్యూతము అశ్లీల ప్రమోదములు నాపుజేయబడెను. ఆమె సైనికులను ధర్మపరాయణులుగ జేయుటకై ఒక నియమమును ప్రవేశపెట్టెను. తదనుసారముగా సైనికు లీశ్వరోపాసనయందు మగ్నులైరి. ఈవిధముగా “జోను” యొక్క దివ్య మాధుర్యపూరిత పవిత్రచరిత్ర పుణ్యప్రభావమున సేనయం దొకయుగాంతర ముపస్థితమాయెను. ఆమె మాతృదేశారాధనా యజ్ఞమున నాత్మాహుతి నిచ్చుటకై నిద్రితాత్మలను మేలుకొలిపి శిక్షణ నిచ్చెను. బహుదినములనుండి యున్న జడత్వమును రూపుమాపుటకు శిథిలప్రవాహమును వేగవంతము చేసెను.

ఆమె కార్యదీక్షాపటుత్వ మెంతయు గొనియాడ దగినది గదా!

# యుద్ధక్షేత్రము

౧

—* ఆర్లీన్సు నగరోద్ధారణ ప్రయత్నము *—

క్రీ॥ శ॥ 1428 సం॥ అక్టోబరు నెలయం దాంగ్లేయు లార్లీన్సునగరము నాక్రమించిరి. ఈ నగరము లోయరునదికి నుత్తరతీరమునం దున్నది. ఒక సుగమ్మైన సేతువువలన నది యొక్క రెండవతీరముతోఁగూడ సంయుక్తమైయుండెను. సేతువున కొకవైపున నొక చిన్నదుర్గ ముండెను. నగరవాసులీ దుర్గమునుండియే రాకపోకలు జరుపుచుండెడివారు. ఈ నగర ప్రవేశద్వార మిదియే యగుటయే దీనికి కారణము. ఫరాసీయు లధిక బాధ నిచ్చినను గూడ నాంగ్లేయు లక్టోబరు మాసాంతమున నీక్షుద్రదుర్గమును వశపరచుకొనిరి. కొలది దినముల లోనే తన్నగర సామీప్యమందలి యనేక స్థానములందు తమ యధికారమును ప్రకటించిరి.

ఈ విధముగా ప్రతికూలావస్థ సంభవించినను "జోన్" అర్లింసునగరోద్ధారణకై 1429 సం॥లో ఏప్రియల్ మాసమున బ్లాయిస్‌నగరమును వీడి "అర్లీంసు" నగరమునకు బ్రయాణ మాయెను. వెళ్లు సమయమున ఫరాసీయ సేనాధ్యక్షు డగు "డూనియస్" చే బంపబడిన సేనతో నామె యిట్లని యెను.

"అర్లింస్ నగరమునకు ఏతోవ త్వరగా చేర్చునో అట్టి

త్రోవనే నన్నా నగరమునకు దీసికొనిపొండు."

కాని, సైనికులామెను తమ యధ్యక్షుడు చెప్పినత్రోవనె తీసికొని పోయిరి. "జోన్" నగరమును బ్రవేశించి చూడగా నాంగ్లేయుల యధికారమునకు లోబడియున్న సేతువు నామె దాటవలసివచ్చెను. ఆమె సైనికులు తన కొనర్చిన మోసమునకు కుపితయయ్యెను. కాని యనుసంధానానంతరము "డునోయిస్" ఆజ్ఞను తెలిసికొని యతనిమీద గోపించెను. "డునోయిస్" ప్రథమమునుండియు దుర్గప్రహరీ గోడనెక్కి "జోన్" యొక్క ఆగమనమును బ్రతీక్షించుచుండెను. సేనాసహితముగా "జోన్" రాకనుగాంచి గోడదిగి యొక చిన్న నావ సహాయమున నదికి రెండవవైపున నున్న "జోన్" ను చేరి యాదర పూర్వకాభివాదనము చేసెను. "జోన్" క్రుద్ధయై యిట్లనెను.

"తమరు నన్నీత్రోవనుండి తీసికొని వచ్చుటకు సైనికులకేల యిట్టి యాదేశ మొసంగితిరి."

డునోయిస్ వినీతభావమున నిట్లు చెప్పెను.

"ఈత్రోవ అన్నిటికంటె సురక్షితమైనది. ఇందువలన నేను అన్యసేనానాయకుల పరామర్శానుసారముగనే యిట్టి యాదేశ మిచ్చియుంటిని."

"జోన్" అధికతర అసంతృప్తిని ప్రకటించి ఇట్లు పృచ్ఛించెను.

"ఈశ్వరాదేశముకంటె తమబోటి సేనానాయకుల యాదేశము లధికతరములా ?"

రెండవదినమున, ఏప్రియల్ 29 తారీఖున, "జోన్" ఏవిఘ్నములు సంప్రాప్తింపకుండగనే సేనాసహితముగ నగర ప్రవేశమొనర్చెను. ఆంగ్లేయు లుపేక్షవహించి యామె కెట్టివిధమైనబాధలు చేయరైరి. నగరప్రవేశమొనర్చి ప్రథమమున ధర్మమందిరమునకు వెళ్లి యామె యీశ్వరు నుపాసించెను. తరువాత నామె నగరమంతటను భ్రమణమొనర్చెను.

ఆమెరాకవలన నగరవాసుల హృదయములందు ఆశాలత యంకురింపఁదొడఁగెను. బహుసంఖ్యాకు లామెను దర్శించుటకును, నామె యమృతమయోపదేశవాక్కుల వినుటకును రానాగిరి. వేలకొలది స్త్రీపురుషులు జయధ్వనులఁజేసి నగర ప్రాకారమును బారదోలిరి. వృథా రక్తపాత మొనర్చి పృథ్విని కలుషితమొనర్చుటయు, ననర్థకమగు నరహత్యలుచేసి యశాంతిని సృష్టించుటయు జోనుయొక్క ప్రకృతికి విరుద్ధమై యుండెను. ఇందువలన నామె యాంగ్లేయులు ఫ్రాన్సును విడచుటకై యనేకోపాయము లాలోచించి చివరకు నాంగ్ల శిబిరములకీ క్రింది సంధిపత్రిక నంపెను.

"ఆంగ్లేశ్వరా! ఆంగ్లసైన్యాధ్యక్షులారా! నే నీశ్వ రాదేశముతోడ స్వదేశోద్ధరణార్థము గడంగితిని. కాబట్టి తమ రెట్టివిధమైన గడబిడయుచేయక ఫ్రాన్సును పరిత్యజింపుమని

వినయపూర్వకముగ బ్రార్థించుచున్నదానను. సైనికులారా! మీరుకూడ నెట్టి యశాంతిని ప్రబలనీయక స్వదేశమునకు మరలుడని సృష్టి స్థితి లయ కర్తయగు పరాత్పరునామమున జెప్పుచున్నదానను. ఓ రాజా, ఇంతకు నతిక్రమించిన సము చిత ప్రతిఫలము ననుభవింపవలసివచ్చునని విశేషరూపమున జెప్పుచున్నదాన. ఒకవేళ దమరు శాంతిస్థాపనాభిలాషు లైనచో మేము సంతోషపూర్వకముగా దమతో సంధి కొనెదము. మఱియు దమకు సాదర స్వాగతమిచ్చెదము."

ఆంగ్లశిబిరములో నీలేఖ చేరగనే నాంగ్లకర్మచారుల యందు విశేషమోజము వ్యాపించెను. ఆలేఖ నవమాన సూచకముగా దలంచిరి. లేఖానాహకుని పలువిధముల హిం సించి, యతనిని గొలుసులతో బంధించి, కారాగారబద్ధుని జేసిరి. ఆంగ్లేయుల యీ దుష్కృత్యమునకు జోను నెంతయు దుఃఖించెను. కాని ధైర్యమును మాత్రము విడలేదు. పరా సీయుల దుర్గసామీప్యముననే యాంగ్లశిబిర ముండెను. ఇది చూచి "జోను" దుర్గ శిఖరోపరిభాగమునకెక్కి తన లేఖాం తర్గత ప్రస్తావనను, స్వయముగ నెలుగెత్తి చెప్పి యాంగ్లే యులకు వినిపింపజేసెను. ఇందువలన నాంగ్లేయుల భావము నెంతమాత్రము మారలేదు. కాని యుత్తేజము మాత్ర మధిక ముగా వ్యాపించెను. "సర్ విలియమ్ గ్లాస్‌డెల్ (Sir William Glasdale) అను నాంగ్లసేనానాయకుడు అత్యంత హీన

జనోచితమగు నశ్లీలభాషలో జోనును తిరస్కరించెను. *
ఇది చూచి జోనెంతయు దుఃఖించెను. ఈ ఘటనవల్ల యుద్ధ
మనివార్యమని తలంచి యూపాన యుద్ధప్రయత్నమున నిమగ్న
యైయుండెను.

౨

— * యుద్ధయాత్ర * —

క్రీ॥ శ॥ 1429 సం॥ మే నెల 6 వ తేదీన కుముక్
నగరమునకై పంపిన యాంగ్లేయుల సైన్యము వచ్చుచున్నదను విష
యము జోనునకు తెలిసెను. ఈ సమాచారము వినగనే
జోను సేనాపతియగు "డూనోయిస్" ను సావధానుడై యుండ
జెప్పి సైన్యము నగరసాంతమున ప్రవేశించునపుడు తనకు తెలియ
జేయవలెనని చెప్పెను. ఆ దినములందంతయు సమరయత్నమున
విశ్రాంతిలేక పరిశ్రమ చేయుటవలన నామె యలసిపోయెను.
అందువలన నామె విశ్రమించుటకై పరుండి పోయెను. అలసి
యుండుటంజేసి కాబోలు నామె తక్షణమె నిద్రించెను. ఇదే
సమయమున "డూనియస్" సైన్యసమేతుడై సెంటు లూప్ అను
దుర్గము (Bastile de St. Loup)ను ఆక్రమించెను. ఈదుర్గ

* Here Glasdale overwhelmed her with abuse calling her coward and prostitute (Michelet's History of France, translated by G. H. Smith Vol. II page 127.)

మాంగ్లేయుల యధికారమునందే యుండెను. అచట నకస్మాత్తుగ జోను మేలుకొనెను. అంతట దక్షణమే నాకతో నిట్లనెను. శస్త్రాస్త్రములను త్వరగా దీసికొనిరమ్ము. నేనుకూడ యుద్ధ క్షేత్రమునకు వెళ్ళవలసియుండును. అచట యుద్ధమునకేగ సంకల్పించుచుండగనే నగరద్వారమున కోలాహలము విన నయ్యెను. తక్షణ మామె యశ్వమునధిష్ఠించి యుచ్చోటికి కరి గెను. అచట నాంగ్లేయులు అవక్రపరాక్రమమున బోరు చుండిరి. ఫరాసీయసైన్యము వెనుకంజ వేయుచుండెను. ఈ దృశ్యము నామెకు గనంబడి చలితకాక పారిపోవుచున్న తన సైన్యమునుకూడ దీసికొని ప్రోత్సహించెను. ఆమెయొక్క ఉత్తేజమయవాక్కులచే ఫరాసీయసైనికులు రణోన్మాదమున వీరావేశములో నవీనోత్సాహమున నాంగ్లేయుల నాక్రమించిరి. జోను సేనకు ముందుగ పోరాడుచుండెను. తరంగమును బోలిన చెదిరింపగలుగు జోనుయొక్క సైన్యమునెదుట నాంగ్లేయు లాగజాలక చిందరవందరయయ్యెను. వీరాంగన యొక్క బలపూర్వకమగు నాక్రమణవలన నాంగ్లేయులు పరాజితులయిరి. శీఘ్రమే ఫరాసీయసైన్య మాంగ్లేయుల హస్తగతమై యున్న దుర్గమును వశపరచుకొనియెను.

దేవియొక్క యసాధారణ రణనైపుణ్యమును అద్వితీయ సేనాధిపత్యకౌశలమును గాంచి యోధగణములు స్తంభితులైరి. కాని యామెయొక్క యీవిధమగు అకల్పిత జయ

లాభమునుగాంచి యశోలిప్సులును స్వార్థపరులును మాత్ర మీమె నీర్ష్యతో జూచుచుండిరి.

ఈమారు యుద్ధముచేసిన జోనునకు పజయము కలుగు నని తలంచి సేనాపతి "డూనియస్" ఆమెతో సంధివిషయ మును గూర్చి ప్రస్తావించెను. జోనీ ప్రస్తావనను విని యిట్లు చెప్పెను.

"మీరు మీ యిచ్ఛానుసార మింటికడ నుండుడు. నేను నాకర్తవ్యమును పాలించుకొందును. రేపటియుద్ధముకొఱకు సైన్యమును సిద్ధముచేయుడు. ఇప్పుడు నీకవశ్యమగు కార్యము లున్నవి."

మరునాడు, "మే" ఏడవతారీఖున నామె యుదయము ననే మేల్కాంచి సమరయత్నమున నిమగ్నయయ్యెను. ఆమె చాల సేనను వెంట నిడుకొని యాంగ్లేయుల వశముననున్న రెండవదుర్గము నాక్రమించెను. ప్రథమ దివసమునం దామె యద్భుతవీరత్వమును అలౌకికసాహసమును చూపించెను. అం దువలన హీనశక్తులును, హతోద్యములు నగు ఫరాసీయ సైనికుల హృదయములం దపూర్వబలము ప్రవేశించెను. ఇందు వల్లనే 7 వ తారీఖు యుద్ధమున వారు విపక్షదళమును జయిం చుట కవక్రపరాక్రమమును చూపింపగలిగిరి. కాని యాంగ్లే యజాతి యొకవీరజాతి. అది రణనైపుణ్యము గలిగినది. సాహ సమున నిరుపమానమైనది. మరియు నధ్యవసాయమునం దటు

లవిశ్వాసమును కలిగియున్నది. ఆంగ్లేయులును పరాసీయుల యాక్రమణను విఫలముచేయ ప్రాణపణమున యుద్ధముచేసిరి. ఆంగ్లసేనాపతి "స్కేల్" వీరోచితపరాక్రమమున పోరుచు సైన్యము నడుపుచుండెను. ఖడ్గముల ఝుంకారములు బల్లెముల సంఘర్షణలు, ధనుర్బాణముల టంకారములు ప్రతిధ్వనించుచుండెను. శరసమూహముల సన్ సన్ శబ్దముల తోడను, గుఱ్ఱముల సకిలింపులతోను, అహతుల మర్మభేద ఆర్తనాదములతోను, రణోన్మత్తవీరుల వికటచీత్కారముల తోడను సమరక్షేత్రదృశ్యము భయానకమాయెను. ఇరుప్రక్కలనున్న సైనికు లతిపరాక్రమమున బోరుచుండిరి.

---

# మంత్ర
# సాధనము

౧

## —* అర్లింసు నగరోద్ధరణము *—

చాల దినము లిట్లు ఘోరసంగ్రామము జరిగినను ఆంగ్లేయులు ఆత్మసమర్పణము చేయరైరి. ఇది గాంచి జోను దుర్గప్రవేశము చేయగోరెను. అనేక సోపానములసాయముగ కోటగోడల నెక్కెను. అట్టిసమయమున నకస్మాత్తుగ నొక శత్రుబాణ మామెను మెడయందు నాటుకొనెను. తత్క్షణ మామె మూర్ఛితయై క్రింది కందకములో బడెను. ఇది చూచి యాంగ్లసైనికు లామెను పట్టుకొనుటకు పరువెత్తి పోయిరి. కాని ఫరాసీయసైనికుల సాహసమూలకమున వారి కోరిక రిత్తవోయెను.

జోను శరీరమందలి గాయమునుండి రక్తము స్రవించుచుండెను. సహింపరాని బాధ కలుగుటచే నామె కన్నీరు నాపజాలకపోయెను. కాని యనతికాలముననే తెలివొంది తన కర్తవ్యమును దలచెను. ఆమె తన దుర్బలత్వమున కెంతయు సిగ్గిలెను. తత్క్షణ మామె నాటుకొనిన శరము నూడబెరికి గాయమునకు గట్టుకట్టెను. తరువాత ననతికాల మీశ్వరోపాసనచేసి యుద్ధమున దత్పరయాయెను.

సేనాపతి డూనియస్ మధ్యాహ్నసమయమును పొందునాటి

లేక రణరంగమునువీడ ప్రస్థానింపసాగెను. జోను ఈపిఱికిపంద నుడువు ప్రస్తావనను వినకపోయెను. ఆమె ద్విగుణీకృతోత్సాహమున నాంగ్లేయుల నెదుర్కొనెను. ఈమా రాంగ్లేయు లధిక కాల మాగజాలకపోయిరి. శీఘ్రమే ఫరాసీయు లాంగ్లేయుల నోడించి దుర్గమును వశపఱచుకొనిరి. ఆంగ్లసేనాపతి "గ్లస్డేల్" సేనాసహితుడై లోయర్ (Loire) నది నంతెనమీాదుగా పరువిడుచుండెను. ఫరాసీయు లదేసమయమున నంగ్లపడలుటచే వంతెన అధఃపతిత మయ్యెను. హతభాగ్యుడగు సేనాపతి ససైన్యముగ నదియందుబడి మరణించెను. శోచనీయమగు నీ దృశ్యమును గాంచి సహజకోమలహృదయయగు జోను కంట దడిపెట్టెను. ఈ యుద్ధమున 8000 లేక 9000 ఆంగ్లసైనికులును, 110 లేక 120 ఫరాసీయ సైనికులును మరణించిరి. *

ప్రథమమునందే యుద్ధమున నోడిపోవుటచే నాంగ్లేయు లుపాయాంతరము గానక ఒక తారీఖున దళబలసమేతముగ నరలీన్సునగరమును వీడిరి. ఈవిధముగా మహనీయయగు వీరాంగన దుర్గమనీయసాహసమునను, అతులవీరత్వమునను నసామాన్యరణకౌశల్యమునను నాంగ్లేయులవలన నవరుద్ధమైన నగరమును పునరుద్ధరించెను. అర్లీంసనగర

---

* An Ancient Chronicler says:—The English lost 8000 or 9000 men, the French only 110 or 120, which shows clearly that it was the work of the Most High." (The Patriot Martyr —Page 38.)

ముద్ధరింపబడగనే నగరవాసు లానందనిమగ్నులై జోనుకు హృదయపూర్వకధన్యవాదము లర్పింపసాగిరి. కాని యామె యీవిజయమంతయు భగవంతునిదే యనియు నతనినే యుపాసింపుడనియు బోధింపగడగెను. జోన్ యెల్లప్పుడు పరమాత్మునినే విశ్వసించుచుండెను. ఆనందమం దెప్పుడునుగూడ నామె భగవత్కృపను మరువలేదు. అర్లింసునగరోద్ధరణానంతరము జోనుపదేశమువలన ఈశ్వరోపాసన ప్రబలమయ్యెను. చాలమంది స్త్రీపురుషు లా యుపాసనమున కృతజ్ఞతాపూర్వకముగ సమ్మిళితమైరి. అరలింసునగరోద్ధరణానంతరము జోను "అర్లింసుకుమారి" (Maid of Orleans) అను నామమున విఖ్యాతి చెందెను.

## ౨

## —* అన్యయుద్ధములు - రాజ్యాభిషేకము *—

కాలమును వృథా నష్టపఱచుట అనుచితమని జోను మరల సేనాసహితయై బ్లాయిస్ (Blois) నగరమువైపునకు సాగెను. అచటినుండి తూర్సు (Tours) నగరమున కేగెను. ఆ సమయమున సామ్రాట్టగు డఫెన్ ఆ నగరముననే యుండెను. రా జామె నాదరముగ నాహ్వానించెను. జోను రాజుతో నాంగ్లేయులకు విరుద్ధముగ నింకను గొన్నియుద్ధములందు

సహాయము చేయఁగోరెను. కాని కాపురుషుఁ డగు డఫిను అమితతేజఃపూరిత యగు వీరాంగనయొక్క వీరత్వపరిచయము బొందియు నామె ప్రస్తావనను స్వీకరింపకపోయెను. కాని చివరకు జోనువలన నానావిధముల వీరోచితోపదేశముల బొంది ఎలెంకన్ డ్యూక్ (Duke of Alencon) నేతృత్వమున నొక సేనాదళమును జోనుకు సహాయార్థమై వశపఱచెను. జోను ఈ నూతనసేనఁగూడి అర్లీంసు నగరమునుండి జార్గో (Jargeau) అను స్థానమున కేగి మరల నాంగ్లేయుల నెదిరించెను. ఇరువాగుల ఘోరసంగ్రామము జరుగుచుండెను. ఆంగ్లసైన్యము సఫోక్ డ్యూక్ (Duke of Suffolk) అనునతని యధీనమున ప్రాణపణమున బోరసాగిరి. కాని జోనుయొక్క యవ్యాహతశక్తి మ్రోల నాంగ్లసైన్య మేమి చేయఁగలదు? పుణ్యజలపరిపూరిత భాగీరథీతరంగములందు ఐరావతము లెట్లు గొట్టుకొనిపోవునో అట్లే వీరమూర్తి యగు జోనువాహిని నాంగ్లసైన్యము పారెను. మఱియు సఫోక్ వంటి తేజస్వి యగు సేనాపతిగూడ జోనుచే పట్టుబడి బందియాయెను.

జార్గో లో ఆంగ్లేయుల నోడించి జోను ససైన్యముగ బోగెంసి అను స్థానమున కేగెను. అచటఁగూడ సహజజయముపొంది దుర్గమును స్వాధీనపఱచుకొనెను.

తరువాత 1429 జూన్ 18 వ తారీఖున పాటే అను స్థానమున నుభయపక్షముల కొకభీషణసంఘర్షణ మాయెను.

తపస్విని యగు వీరలలనయొక్క దుర్జయపౌరుషదీక్షాతేజముల వలన నాంగ్లేయులవీర్యవంతమగు పౌరుషము తేజోవిహీన మాయెను. ఈమారుకూడ నాంగ్లేయు లోడిరి. ఈసారి రణ విపుణుడును, ప్రతిభావంతుడు నగు "టల్బట్టు" అను సేనాపతి బందీకృతు డాయెను. మఱియు "ఫాస్టల్ఫ్" అను పరాక్రమశాలి యగు యోధుడుగూడ రణమున వెన్నుచూపి పారెను.

ఆర్లియన్సునగరోద్ధరణకై జరిగిన ప్రథమయుద్ధమున ఫరాసీయులబారినుండి తప్పించుకొనుటకై చాలమంది యాంగ్లేయులవేషముల మార్చి ధర్మయాజకు లయిరి. ఉదారహృదయయగు జోను వారికి సాదరపూర్వకముగ నాశ్రయ మిచ్చెను. మఱియు వారిని తన సైనికులు హింసింపకుండ దన నివాసభవనముననే విడిది నొసంగెను. *

రెండవయుద్ధమున నాంగ్లసేనాపతియగు "గ్లాస్డేల్" సేనాసహితముగ నదిలో బడి మృతిచెందినపుడు జోను తన శత్రువులమృతికిగూడ జింతించెను. రణానంతర మాహవనిహతులైన వ్యక్తులకై యేడ్చెడిది. ఆహతుల కామె స్వయముగా సేవ యొనర్చెడిది. గాయముల కామె శ్రద్ధతో పట్టీలు వేసెడిది. మరణోన్ముఖుల కామె యమృతోపమఉపదేశము లిచ్చి వారి యాత్మలను శాంతిపఱచెడిది. ♦ పరాజితులగు శత్రువుల

* (Michelet's History of France, Translated by G. H. Smith; Vol. II page 127.)

♦ Lamartine's "Memories of Celebrated Characters" Vol. II page 92.

పట్ల నిట్టి సద్వ్యవహారము, ఆహతులపట్ల పరిచర్యాప్రయత్నము నిజమైన వీరధర్మమున కెట్టి దృష్టాంతము! మాహాత్మ్యమున కెట్టి మనోహరనిదర్శనము! కోమలస్వభావయు, సేవాపరాయణయు నగు రమణీహృదయమున కెట్టి యనుపమ చిత్రము! ఈమె గుణము లెంతయు నాదర్శప్రాయములు గదా?

పాటే అను గ్రామమున యుద్ధము జరిగిన తరువాత నొక మాసాంతమున డఫిన్ యొక్క రాజ్యాభిషేకోత్సవప్రయత్నములు చేయబడెను. రీమ్సు నగరముననే యభిషేకోత్సవముచేయ నిశ్చయింపబడెను. కాని యాసమయమున నా నగరము ఆంగ్లేయులకు లోబడియుండెను. రీమ్సునగర ప్రధాన ధర్మయాజకులు (Archbishop of Rheims) ను, రాజమంత్రులును, సభాసదులును విశేషసైన్యమును వెంట నిడుకొని రాజా డఫిన్ రీమ్సునగరమున కేగెను.

జోన్ యొక్క అపూర్వయుద్ధవిజయములును, వీరత్వమును దేశమం దెల్లెడల వ్యాపించెను. ఇందువలన ద్రోవలో నాంగ్లేయులకు లోబడియున్న స్థానములన్నియు సహజముగనే వీరికి వశమయ్యెను. 1429 జూలై 16 వ తారీఖున రాజు సైన్యసమేతుడై నిర్విఘ్నముగ రీమ్సు నగరమును బ్రవేశించెను. రెండవదినమున నాదివారమున రీమ్సునగరప్రాచీన ధర్మమందిరమున రాజ్యాభిషేకోత్సవము ప్రారంభమయ్యెను.

డఫిను రాజోచితమైన దుస్తులను ధరించి వేదికకడ కేగెను. అతడు సాష్టాంగపడి రాజ్యమును సువిచారముగ బాలించెద ననియు, క్రైస్తవధర్మమును గాపాడెదననియు, ప్రజల సుఖ శాంతి విషయములయెడ శ్రద్ధవహించెదననియు శపథమొన ర్చెను. శపథానంతరము జనసమూహముల విపులజయధ్వా నములు సెలంగ వేదిక నెక్కి "సప్తమచార్లెస్సు" అను నామ మును ధరించి రాజమకుటమున సుభూషితుడై ఫ్రాన్సురాజ సింహాసనము నధిష్ఠించెను.

అభిషేకసమయమున జోన్ క్రైస్తవనామాంకితమగు శ్వేతపద్మచిహ్నితపతాకమును తన కరపద్మమున దాల్చి రాజు ప్రక్కన నిలబడెను. అభిషేకోత్సవము సమాప్తిజెందిన తర్వాత రాజును సన్మానించుటకై యామె పతాకమును వంచి మోకరించి నిలిచెను. అప్పుడు ఉపస్థితమైన జనమండలిదృష్టి యామెవైపునకు మరలెను. అందరు నామె యుపదేశ వాక్కుల వినుట కుత్సుకులైరి. జోను హృదయపుష్పము విక సించెను. ఆమె యుచ్చస్వరమున నిట్లు చెప్పదొడంగెను.

"ఓ రాజా! ఎవరి యలంఘనీయ ఆదేశమున రీమ్సు నగరమందు తమ రాజ్యాభిషేకోత్సవము నిశ్చయింపబడినదో నేడా మంగళమయపరమేశ్వరుని కోర్కి సిద్ధించినది. నేటి నుండితమరు యథారీతిని రాజ్యపదము నధిష్ఠించుడి ఫరాసీయ జాతి సర్వవిషయములందు తమయాజ్ఞానువర్తులై యుందురు."

## 3

### —* పారిస్‌నగరయుద్ధము - పూర్వాభాసపతనము *—

పలుయుద్ధములందు జయము నొందుటచే జోన్ యొక్క కీర్తి నలుదిక్కుల వ్యాపించెను. సేన యామె యాజ్ఞానుసారము వర్తింపసాగెను. రాజుకూడ నామె నధిక భక్తితో జూడసాగెను. ఇట్టి పరిస్థితియందు జోను తన యిచ్ఛను ప్రకటించినమాత్రముననే సన్మానసూచకముగ నుచ్ఛరాజపదము నధిష్ఠించి రాజ్యమును యథేచ్ఛగా స్థాపించ గలదు. కాని వ్యక్తిగతస్వార్థముకొఱకు కామె దేశోద్ధారక పవిత్ర వ్రతోద్యాపన చేయలేదు. ఇందువలననే ఆమె ప్రభుత్వమును, సన్మానమును పొందుకోరిక కామె తనహృదయమునం దెంతమాత్రము స్థాన మిడలేదు. అయినను రాజు కృతజ్ఞతాచిహ్నముగా నామె జన్మస్థాన మగు డుమరిక్ గ్రామము నన్నివిధముల రాజకార్యములతో పునరుద్ధరించెను.

అర్లీన్సు నగరమును దాస్య మను నాగపాశమునుండి విడిచిపుచ్చి రాజును ప్రధానసింహాసనమున బ్రతిష్ఠింప వ్రతము బూని జోన్ కర్మక్షేత్రమున కురికెను. ఇప్పు డామె వ్రతోద్యాపన పూర్తియాయెను. ఇది తలంచి యామె తన గ్రామమునకు వెళ్లి తలిదండ్రులతో గాలముబుచ్చ రాజు నను మతి వేడెను. కాని రాజీ ప్రస్తావన నెవ్విధముగను నను‌మ

తింపకపోయెను. జోన్ లేనియెడల సేనయందుత్సాహహీనత కలిగి శిథిలత జెందు నని రాజు తలంచుటయే యామె కోరిక రిత్తబోవుటకు కారణం బయ్యెను. ఈసమయముననే యతడు పేరిస్ నాక్రమించి యాంగ్లేయుల నచ్చోటినుండి పారద్రోల సంకల్పించెను. జోన్ లేనియెడల నతని యీ కోరిక పూర్ణమగు టెంతయు గష్టము. ఇందువలన జోన్ నెన్నివిధముల ప్రార్థించినను రాజామెను విడిచిపుచ్చజాలక పోయెను. కాని జోను తనమనమున 'భగవత్ప్రేరితములగు కర్తవ్యభారములను నిర్వహించితిని. నూతనకార్యములయందు భగవత్ప్రేరణానుభవము పొందనైతి. కాన యుద్ధమున నెగ్గగల్గుదునా ?' యని తలంచెను. కాని యిష్టము లేకపోయినను రాజానురోధమున నామె మరల యుద్ధమునకు వెళ్ళవలసి వచ్చెను.

క్రీ. శ. 1429 వ సం॥ సెప్టెంబరు 8 వ తారీఖున జోను పేరిస్ నగరము నాక్రమించెను. ఆదినము క్రైస్తవుల పర్వదినమై యున్నది. అయినను రాజాజ్ఞను మీరజాలక తన కిష్టము లేకపోయినను నామె తత్కార్యమునం దడుగిడెను. ఆంగ్లేయులుకూడ ఫరాసీయులనుండి పేరిస్ నగరమును రక్షించుటకై ప్రథమమునుండియు విశేషప్రయత్నములు చేయుచుండిరి. జోన్ వీరోచితపరాక్రమముతో యుద్ధముచేసెను. కాని వారిని జయింపజాలకపోయెను. ఆంగ్లేయుల యాక్రి

మఱకు సహింపజాలమి, యామె సైన్య మధికాంశము వెను జూపినది. అయినను జోన్ వెనుజూపుటకంటె రణరంగమున మరణించుటయే యుచిత మని తలంచి తన యనుయాత్రి సైన్యమును దీసికొని యుద్ధమునకు గడంగెను. ఫరాసీయ సేనానాయకుడగు "డ్యూక్ ఆఫ్ ఎలెంకను" జయచిహ్నము లను గాంచజాలక "జోన్" శత్రుహస్తగత మగు నని తలచి యామెను బలాత్కారముగ యుద్ధభూమినుండి తీసికొని పోయెను.

ఈ యుద్ధమున సుమారు పదునైదువందలసైనికులు లాహుతియైరి. ఈ భీషణరక్తపాతమునకు జోను కారణ మని యామెను నిందించిరి. ఈ జాతీయపర్వదినమున పేరిస్ నగరము నాక్రమించి క్రైస్తవధర్మము నవమానపఱచిన దని యామెమీద నీదోషము నన్యాయపూర్వకముగ వేసిరి. * వాస్తవమున కామె న్యాయముగను, ధర్మముగను, నిర్దుష్టముగను తన జీవితమున నోడిపోవు టిదియే ప్రప్రథమము. ఈ పరాజయమును గాంచి యామె దుఃఖించి భవిష్యదమంగళమునకు పూర్వాభాసమిదియే యని యామె యెంతయు భీతి జెందెను.

---

* This was contrary to the advice of Pucelle; her voice warned her to go no further than St. Denys.

Fifteen hundred men were wounded in this attack, which she was wrongfully accused of having advised...... Michelet's History of France, translated by Smith Vol. (II Page 132)

## ౪

### —* అంతిమయుద్ధము - జోన్ శత్రుహస్తగత యగుట *—

పేరిస్‌నగరయుద్ధములో నోడిపోవుటవల్ల జోన్ హృదంతరాళమున గలిగిన దారుణాఘాతము నామె క్షణమాత్రముకూడ మరువజాలకపోయెను. ఆత్మావమానకరమగు నాస్మృతి ప్రతిముహూర్తమును నామె కోమలహృదయమును దహించుచుండెను. పేరిస్‌నుండి వెడలి యామె బర్గెస్ (Bourges) అను స్థానమున కేగి చలికాలమంతయు నచటనే గడపెను. వసంతఋతుప్రారంభమున జోన్ మరల సేనను కూడబెట్టుకొని శత్రువులకు చేజిక్కియున్న కంపియమ్ (Compiegme) అను నగరోద్ధారణకై బయలుదేరెను. క్రీ. శ. 1430 మే 23 న ఆమె ససైన్యముగ నగరమును బ్రవేశించెను. తరువాత నామె తన స్వాభావికబలవీర్యపరాక్రమములతో శత్రుదుర్గము నాక్రమించెను. కొద్దిసేపు యుద్ధముచేసిన తరువాత జోన్‌యొక్క సైనికులు శత్రుపరాక్రమమును సహింపనేరక పారదొడగిరి. జోన్ పారిపోవు సైన్యమును మరల్చి నూతనవ్యూహముల బన్ని యుద్ధము చేయసాగెను. కాని ఫరాసీయసైనికు లీమారుకూడ ప్రాణభయమున బారిరి.

జోన్ రెండవమారుకూడ సేనను ప్రోత్సహించి మరల యుద్ధమునకు గడంగెను. అంతమున జయముపొందు నాశలేక

యామె సైన్యమును రణరంగమునువీడ నాజ్ఞయిచ్చెను. జోన్ కూడ కొలది యంగరక్షకుల నిడుకొని సమరభూమిని వీడదలంచుచుండ శత్రువు లామెను చుట్టు ముట్టిరి. జోన్ తన యనుచరులతో నసమపౌరుషమున శత్రువులయాక్రమణను వ్యర్థము చేయసాగెను. శత్రుపక్షసైనికు డొక డకస్మాత్తుగ జోనును బలాత్కారముగ గుఱ్ఱమునుండి క్రిందికి పడద్రోసెను. కాని తత్క్షణ మామె లేచి యాత్మరక్షణకై పోరసాగెను. శత్రుపక్షీయు లామెపై లంఘించిరి. ఆత్మరక్షణ మసంభవ మని తలచి జోన్ శత్రుపక్షమునకు సాయ మొనర్చుచున్న దేశద్రోహి యగు నొక ఫరాసీయుని (Bastard of Venderi) హస్తమున కాత్మ నర్పించెను. ఈ దేశద్రోహి యామెను "డ్యూక్ ఆఫ్ బర్గండి" యొక్క ప్రధానసేనాధిపతియగు కౌంటులిగ్నీ అనునతనిపరము గావించెను. వీ రిద్దరును జోన్ యొక్క స్వజాతీయులును స్వదేశవాసులును నని వేరుగ నుడువనక్కరలేదు. జోన్ పక్షీయులగు కొంతమంది నీచసేనానాయకులు ఆమె విమలకీర్తితో దహింపబడి శత్రువులనుండి గడ్డితిని యామెను పట్టించిరని ప్రతీతికూడ కలదు. స్వార్థపరులగు దేశద్రోహులు యెట్టి నీచాతినీచకార్యముల నైనను చేయగడంగుదురుగదా !

# కారాగారమున

౧

—♦ జయిలుకథ ♦—

జోను బందీయయ్యెను. ఆమె స్థూలకాయమును కారాగారమున బంధించిరి. కాని యామెహృదయమును బంధింపజాలకపోయిరి. ఆమె దివ్యతేజమును, అలౌకికబలవీర్యములును నొకముహూర్తమాత్రమైనను తగ్గలేదు. నిజమైన వీరధర్మానుసారముగ జోనుకు వారుచితసౌకర్యముల జేయవలసియుండెను. కాని వారు ప్రాచీనరాజనీతి నుల్లంఘించి యామెను సాధారణ బందీగా జూచుచుండిరి. కారాగారమున నింద్యదశలో నామెను హింసించిన యత్యాచారములు వారి నీతిహైన్యమును, నృశంసత్వమును, పిఱికితనమును ప్రకటించుచుండెను. 1430 సం॥ మే 23 వ తారీఖున జోను శత్రువులకు జిక్కినది. కాని యామె రెండవ వత్సరము 1431 జనేవరిలో నామె విచారణ యారంభమై మే 10 తారీఖునకు సమాప్తమయ్యెను. అనగా నామె పూర్తిగా నొక వత్సరము జైలు కష్టము లనుభవింపవలసివచ్చెను.

“కంపియమ్” యుద్ధమున పట్టుబడినది మొదలు ఆమె సేనాపతి “కౌంట్‌డీలిగ్నీ” వశమున నుండెను. ఇతడు “లక్జెంబర్గ” రాజు నధీనమునున్న యొక జమీందారు.

కాబట్టి యతడాయు నాంగ్లప్రభువును సంతోషపెట్టుటకై భూపతికి సమర్పింప సంకల్పించెను. లిగ్ని భార్య యీ సమాచారము విని తన పతిని నా పక్షమునుండి మరల్ప విశ్వప్రయత్నములు చేసెను. మరియు నామె పతిచరణముల నంటి జోను యొక్క ముక్తిభిక్షను వేడెను. కాని యీ యంతఃపురకాంత హృదయమందలి ఉచ్ఛభావ మతని హృదయము నెంతమాత్రము నంటజాలకపోయెను. "లిగ్ని" విదేశీయుల కాత్మను విక్రయించి యొక్కమ్మడి స్వజాతిని స్వదేశమును మఱచిన ద్రోహి. అట్టివాని స్వార్థబధిరశ్రవణములయం దాతని స్త్రీవాక్యము స్థానమును పొందజాలకపోయెను. అత డామెను "డ్యూక్ ఆఫ్ లక్జెంబర్గ్" కు వశమొనర్చియే తీరెను. కాని యీ సుహృదయుడగు నాంగ్లసామంతుడు బందీయగు శత్రురమణి కెట్టికీడును జేయక "బ్యూరేవర్" అను నగరమందలి తన స్వగృహమునకు దీసికొనిపోయెను. అచ్చటి కాంతాజను లామెను నాదరించి తమ సౌజన్యమును వెలిబుచ్చిరి. వారి యనురోధమున జోను సైనికవేషమును వదలి యొక్క నారీమణికి నుచితమగు దుస్తుల దాల్చెను. ఆమె యప్పటివఱకు దుర్వ్యవసాయులగు సైనికులనుండి యాత్మసంరక్షణార్థమై పురుషవేషముననే యుండెను.

కొలదికాలము గడచెను. అంత నాజోను హృదయము స్వదేశవాసులకై పరితపింపజొచ్చెను. ఆమె తన హృదయావే

శము నణచజాలకపోయెను. ఆమె యొకదినమున నామంది రపుగోడను దూకి పారిపోవ యత్నించెను. కాని భూమిమీఁద పడుటచే గలిగిన గాయమువలన నామె ప్రయత్నము విఫలమయ్యెను. ఆమె మరల మందిరాంతర్భాగమునకు దీసికొని రాబడెను. అనతికాలముననే యామె యచటి హితైషులశుశ్రూషవలన స్వస్థత పొందెను. తరువాత డ్యూక్ ఆఫ్ లక్జెంబర్గ్ ఆమెను తనదగ్గర నుంచుకొనుట ప్రమాదకరమని తలచి యామెను "డ్యూక్ ఆఫ్ బర్గండీ" అను నతనికడకు బంపెను. "డ్యూక్" ఆదేశానుసారముగ స్కార్ప్‌నదీతటస్థముగు "ఆరాస్" అను నగరమందు సురక్షితకారాగృహమున జోను బందీయాయెను. కొలదిదినముల యనంతర మామె మరల "ఆరాస్" నుండి క్రొటోయె అను స్థానమునకు బంపబడెను.

తరువాత నామె యసాధారణనిందితుల వలెనే రాయన్ నగర దుర్గమునకు రప్పింపబడెను. చాలమంది సైనికులామె వెంటనుండిరి. ఆమె యధికజనసమ్మర్దముగు రాజపథమున దీసికొని పోబడుచుండెను. ఆమెకు శృంఖలములు తగిలింపబడియుండెను. అశిక్షితులును చరిత్రహీనులునగు సైనికుల యధీనమున నుండవలెనని జోను మరల పురుషవేషమును ధరించియే యుండెను. ఇచట "కౌంట్‌లిగ్నీ" అను నతడు బంధింపబడియున్న జోనును గాంచి యవమానకరముగ నిట్లు చెప్పెను.

"జోన్," నేను నిన్ను కారాగారమునుండి విడిపింప నేతెంచితిని. కాని నీ విప్పటినుండి మాకు విరుద్ధముగ నస్త్రము నను ధరింప నని శపథము చేయవలెను." బందీ యగు వీరాంగన యీ పరిహాసమును సహింపజాలకపోయెను. జోను నిర్భ కచిత్తముతో దిరస్కారస్వరమున నిట్లు జవా బిచ్చెను. "తమరు నన్ను పరిహాసించుచుంటిరి. నన్ను కారాగారమునుండి విడిపించుటకు దమ కధికారము లేదు. మరి యట్టికోరికకూడ తమకు లేదు. ఆంగ్లేయులు నా ప్రాణనాశనము చేసెద రని నే నిదివరకే గ్రహించితిని. నా మరణానంతరము ఫ్రాన్సు తమ హస్తగత మగునని వారి యుద్దేశము. కాని మీ యీ ఆశ వ్యర్థమగును. ఆంగ్లేయులందు లక్షగుణములుకలిగినను ఫ్రాన్సు వారియధీనమునసుండ నిచ్చగింపదు. ఇది నిశ్చయము." జోను ముఖమున నిట్టి వీరోచితవాక్యముల విని "లిగ్నీ" వెంటనున్న యాంగ్లేయు డొకడు మండిపడెను. వాడు క్రోధమున నున్మత్తుడై శృంఖలాబద్ధయై నిరాశ్రయముగనున్న జోనురొమ్మున రుధిరపిపాసియై కత్తి నిజొప్పింప నుంకించెను. * కాని మరి యొకడు అతనిని వారించెను. కారాగారమున కాపలాగాయువానినుండి ప్రతివాడు నామెను అసహ్యముగ చూచుచుండిరి.

ప్రసిద్ధఆంగ్ల యితిహాసలేఖకుడగు టర్నరు (Turner)

* See Michelet's History of France translated by Smith Vol. II, page 145.

అను నతడు జోనుయొక్క కారాగారానుభవముల నిట్లు వివరించెను.

"Her feet and legs were fettered to a strong chain which traversed the end of her bed, and was hooked to a large piece of wood, five feet long. Another chain was fastened around the middle of her thin and spare body, so that she could not move from her place. A cage of iron was sworn to have been made for her, in which she was fastened by the neck, feet and hands, from the time of her arrival at rouen to the first day of her trial."*

అర్థము:- ఆమె రెండుకాళ్లు దృఢముగు లోహపుగొలుసులతో గట్టబడియుండెను. అయిదు అడుగుల పొడవుగల యొక పెద్ద లక్కడిలో బిగింపబడెను. ఆగొలుసు జోను నిద్రించు పడక కొకవైపునుండి రెండవ వైపువరకు నుండు పొడవున నుండెను. మరియొక గొలుసున నామెదుర్బలశరీర మెటువైపునకు కదలకుండునట్లు బంధింపబడియుండెను. ఆమెకై ప్రత్యేక మొక లోహపంజరముకూడ తయారుచేయబడెను. "రూయన్" నగరమున బంధింపబడినప్పటినుండి విచారణప్రారంభదివసమువరకు నామె యాలోహపంజరమున బంధింపబడియుండెను.

జోను శత్రుహస్తగతయై అసహ్యమగు నిట్టి కారాగారపుకష్టముల ననుభవించుచు, తన శక్తిని గోల్పోవు

* See Turner's History of England Vol. II, page 593.

చుండగా కృతజ్ఞతాశూన్యుడును పిరికిపందయునగు "రాజా చర్లెస్" నిశ్చేష్టాభావమున నుండెను. ఎవరిసాధనాబలము నను, విజయశక్తివలనను పోగొట్టుకొనినరాజ్యమును మరల దన యధికారమునకు దెచ్చుకొనెనో, మ రెవరి యలౌకిక వీరత్వమున నతడు రాజ్యసింహాసనము నధిష్ఠించెనో అట్టి దేపీజోన్ నుద్ధరింప "చార్లెస్" యెట్టి యత్నమును సలుప డయ్యెను. ఈ క్షమానర్హ అకృతజ్ఞతాపూర్వక కృత్య మత నిని యెల్లప్పటికి కలంకితము చేసెను.

౭

## —* విచారణప్రహసనము *—

జోను "రాయన్" నగరమున కారాగారమందు శారీరక మానసికయాతన లనుభవించుచు దినమున కొకవిధముగా క్షీణించి పోవుచుండ నదేసమయమున నామె శత్రువులగు నాంగ్లేయు లామె నంతమొందింప నుపాయము నన్వేషింప దొడిగిరి. ఇప్పుడు వారు జోను విచారణను తలచిరి. సాంగ్రామికవిచారణాలయమున నామె విచారింపబడుచో మరణశిక్ష జరుగదు. ఎందుచేతనన యుద్ధముచేయుచు నొకవ్యక్తి శత్రుహస్తగతమయ్యెనేని యావ్యక్తి వీరధర్మానుసారముగ సభ్యజాతు లన్నిటి సమక్షమున నవధ్యుడు. కాని జోనుయొక్క అపూర్వ

రణమై పుణ్యమును అలౌకికశక్తిని గాంచి భీతులయిరి. తత్కారణమున నసాధారణబుద్ధిశాలినియు, భగవత్ప్రేరితయు నగు నొక శత్రుపక్షీయరమణీమణిని జీవములతో నుంచుట హానికర మని తలచిరి. ఇందువలన నామెను "సైతాన్ కీచాలీ" అనియు "ధర్మవిరుద్ధాచరణ" అనియు చెప్పి యాంగ్లేయు లామెను ధర్మయాజకులకు విచారణార్థ మప్పగించిరి.

ఆ సమయమున కచన్ (Cauchon) అను నొక పరాసీయుడు బోవెస్ (Beauvais) నగరమునందలి ధర్మమందిరమున కధ్యక్షుడు (Bishop) గ నుండెను. స్వార్థపరుడై తనను తానే విదేశీయుల కమ్ముకొనెను అతడు స్వదేశమును స్వజాతిని మరచెను. అతడు జోనునకు విరుద్ధముగా దుర్వృత్తి నవలంబించి యాంగ్లేయుల యనుగ్రహము సంపాదించుట యతని కెంతయు మంచి యుపాయముగా దోచెను. "కచన్" యొక్క సాయము బడయుటచే నాంగ్లేయుల సంకల్ప మనేక సరళమయ్యెను. జో నప్పటివరకు "డ్యూక్ ఆఫ్ బర్గండీ" కడనే యుంచబడెను. ఇందువల్ల ఫ్రాన్సుయొక్క ధర్మసంబంధవిచారణాలయప్రధానాచార్యుడు (Vicar General of Inquisition) 26 మే రోజున అనగా జోను పట్టుబడిన మూడవదినమున డ్యూక్ దగ్గర కీక్రింది లేఖ నంపెను.

"జోను అను స్త్రీ తమదగ్గర బందీఅయియున్నది. ఆమె ధర్మవిరుద్ధాచారిణి యని మేము విశ్వసించుచున్నాము. ఇందు

వలన పవిత్రధర్మానుసారముగ విచారించుటకై యామె నిక్కడకు బంపగోరుచున్నాము. ”

ఇంగ్లాండుయొక్క “కార్డినల్” ఆదేశానుసారముగనే వాయికర్ యీ లేఖనంపెను. కాని డ్యూక్ ఆఫ్ బర్గండీ ధర్మయాజకాధ్యక్షుని లేఖానుసారము సంచరింప ననుమతింపక పోయెను. అప్పుడు పేరిస్ విశ్వవిద్యాలయాధికారులు జోనును ధర్మాధికారి (inquisitor) కి విచారణార్థ మప్పగింప మరియొక లేఖ నంపిరి. పేరిస్ నగర మాసమయమునం దాంగ్లేయులకు లోబడి యున్నదని వేర నుడువనక్కరలేదు. ఇందువల్ల ప్రధానులందరు వారిముఖమును చూచి వివశులై యుండిరి. డ్యూక్ ఆంగ్లేయులతో స్వార్థములయందు కలిసియుంటచే విశ్వవిద్యాలయాధికారుల యాజ్ఞను నిరోధింపజాలక పోయెను. ఇచట దేశద్రోహియు స్వార్థపరుడు నగు “కచన్” జోనును తన విచారణప్రదేశముననే పట్టుపడె ననియు నందువలన నామె విచారణ తానే సల్పెదననియు నింగ్లీషుఅధిపతితో చెప్పెను.

రాజు అతనికోరికను విని సంతోషాన్వితుడయ్యెను. 1430 సం॥ జూన్ 12 వ తారీఖున నతడు విశ్వవిద్యాలయమునకొక లేఖ నంపెను. “జోను యొక్క విచారణభారము “బొవెయి” నగరధర్మాధ్యక్షుడగు ‘‘కచన్” అను పవిత్రధర్మశాసనప్రతినిధిశిరమున నంపబడెను.’’ జోన్ యొక్క విచా

రణ విషయములో నిట్టి సంగతి వ్యాపించునపు డాంగ్లేయాధి కారమునందలి మరి రెండు నగరములు ఫరాసీయులకు వశమైనవి. ఇంగ్లండుయొక్క కార్డినల్ ఈ అశుభలక్షణమును గాంచి యత్యంతదుఃఖితుడయ్యెను. అతడు ఫరాసీయ రాజగు "చార్లెస్" ఇంద్రజాలికశక్తిసంపన్నయగు నొక స్త్రీసహాయమున రాజపదమునం దభిషిక్తుడయ్యెనని ప్రకటించెను. అతడు శత్రురాజును నాగరకతా ప్రపంచమున హీనునిగ జేయుటకై యధికాడంబరముతో నాంగ్లరాజుయొక్క రాజ్యాభిషేకోత్సవము జరుపుటకై యత్నము సల్పుచుండెను.

1430 సం॥ డిశంబరు 2 వ తారీఖున నాంగ్లభూపతియగు హెన్రీ పేరిస్ నగరమును ప్రవేశించెను. అచట నతని రాజ్యాభిషేకోత్సవము జరుపబడెను. జోన్ యొక్క విచారణ కాలస్యమగుట చూచి రాజు మరల నావిషయమున దొందరింప నాజ్ఞాపించెను. ఈ యాదేశమునుపొంది "బిషపు" అధికోత్సాహముతో విచారణప్రయత్నమున నిమగ్నుడయ్యెను. నిష్కళంకితయగు జోన్ యొక్క చరిత్రయం దేదైన దోషమారోపించుటకై యామె జన్మస్థానమగు డుమరివ్ గ్రామమున కొక ప్రసిద్ధపరిశోధకు డంపబడెను. ఆమెకు విరుద్ధముగ కూటసాక్ష్యముల దయారుచేయుటకై యన్యస్థానములకుగూడ పరిశోధకు లంపబడి రని చరిత్రకారులు నుడివిరి *

* But, as in the greatest judicial investigations in History, it was necessary to obtain false witnesses in order to

ఆకొన్న నక్క లెట్లు శవాన్వేషణమున నిమగ్నములై తిరుగుచుండునో యట్లే యీ పరిశోధకులుకూడ భిన్నభిన్నస్థానములయందసత్యసాక్ష్యనిరూపణకై గుమ్మరసాగిరి. కాని వారెచ్చటను జోనుకు విరుద్ధప్రమాణములను సంగ్రహింపజాలకపోయిరి. ఏ రెచటనైనను జోన్ యొక్క విషయమును చర్చించినయెడల నచటివారు జోన్ యొక్క యీ విపద్విషయమున దమ సానుభూతిని ప్రకటింపజొచ్చిరి. కొందరామె సద్గుణములను వర్ణించుచు నేడువసాగిరి. కొందరు వివిధవిధముల నామెప్రశంస నారంభించెడివారు.

## 3

### —* విచారణారంభము *—

క్రీ॥ శ॥ 143। సం॥ జనవరి 9 తారీఖున జోన్ యొక్క విచారణారంభ మయ్యెను. ధర్మాధ్యక్షు డగు "కచన్" మరియు ధర్మశాసనప్రతినిధిగణములును విచారణాసనమున నాసీను లయిరి. నీతివిశారదులగు అష్టవ్యక్తులును మరియు

---

accomplish the objection view. So the enemies of the maid were in some difficulty to procure such evidence as would incriminate her.

(The Patriot Martyr – Page 85)

ననేక అన్యసభ్యులును విచారణాకార్యమున సహాయము కొరకై యం దుపస్థితు లైరి. జోసును ఘాతినీ! ధర్మవిరుద్ధ చారిణి! యని యభియోగము చేయుటకై ప్రధానన్యాయా ధీశు డగు "కచను" సంగ్రహించిన ప్రమాణములు అం దుప స్థితు లైన యధికారాంశవ్యక్తులకు చాలకపోయెను. అప్పుడు కచన్ ఉపాయాంతరము గానక ద్వితీయసమావేశమునకు దనకు సహాయార్థము విచారణయందు మఱికొందర వ్యక్తు లను పంపగాన ప్రార్థించెను. అతని స్వేచ్ఛాచారపూరిత విచారణాసంబంధమున విఘ్నములు గల్పింప యత్నించువారిని, తన యభిప్రాయముతో నేకీభవింపనివారిని దొలగించెను.

ఈ విధముగ సిద్ధిపథమందలి కంటకులను దొలగించిన తరువాతను విచారణోపకరణములన్నియు సమకూర్చుకొని ఫిబ్రవరి 21 వ తారీఖున జోన్‌ను విచారణాలయమున బ్రవేశ పెట్టిరి. ఆదినమున "కచన్" విచారణాధికారులచే నిర్ణయింప బడినవారి ప్రశ్నలకు సరియగు సదుత్తరము లిమ్మని జోను ననుబోధించెను. వారి ప్రశ్నలకు జో నిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

"తమరు ఎట్టి ప్రశ్నలు నన్నడుగుదురో వానిని నే నె ఱుగను. తమ రెట్టి ప్రశ్న నడిగినను వానికి నే నెట్టి ప్రత్యుత్త రము లీయజాల" ననెను. చివర కామె దైవవాణివిషయమును విడచి యన్యసంబంధవిషయమున సరియగు ప్రత్యుత్తరము

లీయ సమ్మతించెను. విచారణాధికారులు "లామె శిరము ఖండింప బడుచున్నను దైవవాణివిషయసంబంధము నెంతమాత్రము నుడువ" దని "కచను"తో చెప్పిరి. జోన్ యొక్క యీ దృఢ నిశ్చయమును గాంచి దైవవాణివిషయమును జెప్పించుటకై యామె నెంతయు విసిగింప నొడంగెను. తరువాత 22, 24 తారీఖుల సమావేశములయందుకూడ నిట్లు విసిగింపబడెను. కాని యామె యథార్థతినే దృఢచిత్తయై యుండెను. విచారకు డడుగగా నామె తాను 19 వత్సరముల వయస్క ననియు; గొలుసుతో బాధించుటవలన దన కనేకబాధలు కలిగిన వనియు వానివివరములతో బ్రత్యుత్తరమిచ్చెను. మరల నామె నిట్లు ప్రశ్నించిరి.

"నీవు పారిపోవ యత్నించుటచే నిన్ను శృంఖలాబద్ధ నుగ జేయవలసి వచ్చెను."

జోన్ నిర్భయముగా నిట్లు నుడివెను.

"నేను పారిపోవ యత్నించినది వాస్తవము. ఇట్లు చేయుట యే ఖైదీకైనను అనుచితమని కూడ నే నెఱుగుదు."

నాల్గవసమావేశమున జోన్ సంకోచజాలమును విడచి తాను యథార్థముగ దేవవాణిని వింటి నని స్పష్టముగ వారితో నుడివెను. దేవవాణి యామె కే యాదేశ మిచ్చెనో దానినికూడ విశదముగ వివరింపు మని యడుగగా జో నిట్లు జవాబిచ్చెను.

"నేను అన్నివిషయములను ప్రకటింపజాలను. తమ ప్రశ్నలకు జవాబు లిచ్చి దివ్యదూతలను సంతుష్టులం జేయ నే నెక్కువగ భయపడుచున్నదానను. ఈ విషయమును గూర్చి యింకెంతమాత్రము పృచ్ఛింపకు డని ప్రార్థన."

ఇది విని కచ సిట్లడిగెను. "సత్యము చెప్పుట పాపమగునా ?"

జోను దార్ఢ్యపూర్వకముగా నిట్లు జవా బిచ్చెను.

"దివ్యదూత నా కిచ్చిన యాదేశము దసిరా ప్రభునికొ అజ్ఞయైయున్నది. కాని తమకొఱకు కెంతమాత్రము కాదు."

ఆమె హృదయవేగము నెంతమాత్రము నణచియుంపజాలక మరల నిట్లు చెప్పదొడగెను.

"నే నీశ్వరునికడనుండి వచ్చియుంటిని. ఇచట నా వలన నెంతమాత్రము ప్రయోజనము లేదు. నే నెవరికడనుండి వచ్చితినో అచ్చోటికే నన్ను పంపుడు. తమరు నా యపరాధవిచారణకర్తల మని చెప్పుచున్నారు. ఆలోచించిన తమ రేమి చేయుచున్నది విశదమగును. నేను నిజముగా దైవప్రేరితను. కాబట్టి తమరు మీ కోరికతోడనే విపద్గ్రస్తు లగుచున్నారు."

జోన్ యొక్క యీ తేజఃపూరితవాక్యములను విని యభిమానులగు విచారణకర్తలు త్తేజితులైరి. అత్యంతహీన ప్రకృతి జనులవలె జోనును అన్యాయముగ జటిలములగు

ప్రశ్నలను వేయసాగిరి. వా రామె ని ట్లడిగిరి.

"రమణీ! నీవు దైవానుగ్రహము పొందితి వని విశ్వసించుచున్నావా?"

ఈ ప్రశ్నకు జవాబు "అవును" "లేదు" అను రెండు జవాబులను చెప్పుటయు విపజ్జనకములు. ఎందుచేత నన, లేదని చెప్పుటచే జోను దైవానుగ్రహమునుండి వంచిత యని సిద్ధమగుచున్నది. కాన నామె యేవిధముగా దనను దైవానుగ్రహప్రాప్త నని చెప్పి ప్రచారముచేయగలదు? ఔ నని చెప్పుటకుగూడ నామెకు గఠినమైయుండెను. కారణం బేమన, నీ పాపప్రలోభితజగత్తున నితాంతదంభము తప్ప నే యితర దృఢత్వముతోను 'నాకు దైవానుగ్రహము ప్రాప్తమైనది' అని చెప్పజాలదు. క్రైస్తవసమాజమున తాను దైవానుగృహీత నని నుడివి ప్రచారము గావించుట యధికతరనిందనీయముగా దలంచబడుచుండెను. కాని జోను యీ ప్రశ్న కెంత మాత్రము చలింపక ధైర్యచిత్తమున నిట్లు జవా బిచ్చెను.

"నాకు దైవానుగ్రహమే ప్రాప్తించనియెడల నన్ను అందుండి వంచన బడకుండచేయు మని యీశ్వరుని ప్రార్థించుచున్నదానను."

ఆమె మరల నిట్లు చెప్పెను. "ఆహా నేను నిజముగ దైవానుగ్రహముతో వంచింపబడుచో నావంటి ఘోరతర పాపిని యీ జగత్తున మ రెవ్వ తె యుండును? కాని నాయందు

బాప మిమిడియున్నచో నిశ్చయముగా నేను దేవవాణిని విని యుండను." జోన్ యొక్క యీ ప్రాశ్నోచితోత్తరము విచారణకర్తల యుత్తేజమును విద్వేషమును శతవిధముల పెంపొందించెను. వారు హతాసులై చాలసేపటివరకు విచారణ నాపిరి.

తరువాత వారు ద్విగుణితోత్సాహమున విచారణ నారంభించి జోనుయొక్క సర్వనాశనము చేయ పలుప్రశ్నలు వైచిరి. ఈ విధముగా నాల్గవసమావేశ మంత మైనది.

ఐదవదినమందలి సమావేశమున విచారణాధికారు లెంతయు నీచభావమున జోనును ప్రశ్నించిరి. జోనును సైతా నని ప్రమాణము చేయుటకై తమ బుద్ధికుశలతనంతయు నుపయోగించిరి. వా రామె ననేకయనుచితప్రశ్నల నడిగిరి.

విచారకుడు—"నీవు దర్శించినమూర్తి యథార్థముగ దివ్యదూతయే యని నిశ్చయపూర్వకముగ చెప్పగలవా?"

జోను నిర్భయముగ నిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "ఈశ్వరునియందు నా కెంత విశ్వాస మున్నదో యీ విషయమునందుకూడ నంతే."

తదుపరి యామె పతాకవిషయసంబంధములగు ననేక ప్రశ్నలు వేయబడినవి.

ప్రశ్న—నీవు ధరించినటువంటిపతాకము శుభమైన దియు ఫలదాయినియు నని సైనికులకు బోధించియుంటివా?

జవాబు—లేదు. వీరులవలె నాంగ్లేయుల నెదుర్కొనుము. నేనుకూడ మి మ్మనుసరించెద నని మాత్రము నుడివియుంటి.

ప్రశ్న—మంచిది. నీ కరకమలమును పాదపద్మమును అత్యధిక ప్రేమతో ముద్దిడుకొనువారందరు నేయుద్దేశ్యమున నీదగ్గరకు వచ్చుచుండెడివారు.

జవాబు—వారు నా యిచ్ఛానుసారముగనే వచ్చుచుండెడివారు. మాతృదేశమునకై ప్రాణ మర్పింప సంసిద్ధులై యున్న సైనికు లన్న నా కత్యంత ప్రేమ.

“కచను” నియమించిన సహాయప్రాడ్వివాకులు (అసెసరులు) కొందరు ఇట్టి యవాంతరప్రశ్నలను ప్రతివాదించిరి. కాని యిందుకు ఫలము విరుద్ధమాయెను. ప్రతివాదు లిక జోనుపక్ష మవలంబింపవలసినవారైరి. ఈ పరిణామమును గాంచి వారిని “కచను” పదచ్యుతుల నొనర్చెను. తరువాత 10 నుండి 17 మార్చివరకు “కచను” అల్పసంఖ్యాకుల సాయమున గుప్తమందిరమున సమావేశమై విచారించెను. ప్రథమమున విచారణాలయముననే విచారణ జరుగుచుండెను. కాని యనంతరము “కచను” ఆదేశానుసారముగ కారాగారమునందే విచారింప నిశ్చయింపబడినది. అచ్చోటికి జనగణములు రాకుండ నరికట్టబడిరి. మందిరద్వారములన్నియు మూసి జోనును నానావిధ అసహ్యప్రశ్నలను పృచ్ఛించిరి. 18 వ

మార్చి తారీఖున జోను నిట్లు ప్రశ్నించిరి.

"తలిదండ్రుల యనుజ్ఞ వడయకయే గృహత్యాగ మొనర్చుట నీ కుచితమగు కార్యమేనా?"

జవాబు—"వారు నన్ను క్షమించెదరు. నేను భగవదాదేశమును పాలించితిని. ఇందువలన దలిదండ్రుల విడచినను యీ కార్యము నా కనుచితము కాదు. భగవదాజ్ఞయే యిందుకు కారణము."

ప్రశ్న—"జాతీయపర్వదినమున ప్యారిస్ నగరమును ముట్టడించుట యుచితమా?"

జవాబు—"జాతీయపర్వదినమును నెరవేర్చుటకు ప్రతి వ్యక్తియును బాధ్యుడు"

ప్రశ్న—"బోవెరో నగరమున మహలునుండి యెట్లు దుమికితివి?"

జవాబు—"కంపియన్ నగరమందలి యాబాలవృద్ధవనితలందరు నిశ్శంకగా జంపివేయబడుదు రని వినియుంటిని. నేను కూడ నాంగ్లేయులకు అమ్మబడుదు నని వినియుంటిని. ఇందువలన వారి యధీనమున నుండుటకంటె మరణించుటయే యుచిత మని తలచి యట్లొనర్చితిని."

ప్రశ్న—"నీవు ధరించుచున్న యంగుళీయకమునం దేమైన నైంద్రజాలికశక్తి యున్నదా? సమరరంగమున నీవు పలుమారు లద్దాని నేల వీక్షించుచుండుదానవు?"

జవాబు—"అందు ప్రభువగు క్రీస్తు మహాశయునినామ
ముండుటచే నేనట్లు చూచుటకు గారణము."

ఇట్లే యింకను పలు అసంబద్ధములగు ప్రశ్నలు వైచికూడ వా రామెను అపరాధినిగ నెంచజాలకపోయిరి. తుదకు "నీవు ధర్మమందిరాధిపతులసమక్షమున నాత్మసమర్పణముచేయ నిచ్ఛగింతువా? లేదా?" యని వా రామెను ప్రశ్నించిరి. అందు కామె యిట్లు నుడివెను.

"నేను భగవత్ప్రేరితనై యీ పనులను నెరవేర్చితిని. అందువలన నేను భగవంతునిసమక్షముననే నా యాత్మను సమర్పించెదను."

ప్రశ్న—"మరి ధర్మమందిరాధికారుల యెదుట?"

జవాబు—"నే నిక ఏజవాబును ఇయ్యజాలను."

జోనుయొక్క యీ జవాబువలన విచారణమందిరమున కోలాహలము కలిగించెను. విచారకులయందును అసెసరుల యందును మతభేదము కలుగజొచ్చెను.

ఒక "అసెసరు" జోన్విషయమున నిట్లు చెప్పెను. జోను ఈశ్వరునితప్ప నన్య నెవ్వరిని విశ్వసింపదు. ఇంకను ధర్మయాజకులు మొదలగువా రామె కనుకూలముగ మాట్లాడిరి. వీ రందరు కలిసి "జోన్" నేవిధముగ నైన నుద్ధరింప సమకట్టిరి. ఆ సమయమున "కచను"కు విరుద్ధముగ జోన్ కడ కేగి గుప్తోపదేశము చేసిరి. మరుదినమున విచారణకై

యామె ధర్మగురువగు పోపునెదుట బ్రవేశపెట్టబడెను. పోపు సమక్షమున విచారణ న్యాయముగ జరుపుడని ప్రార్థించెను. ఆమె ప్రార్థనల నాలకించి "కచను" క్రుద్ధుడాయెను. మఱియు పహారాదారు నిట్లడిగెను. కారాగారమున "జోను" నెవరైన కలిసికొనిరా? "కచను" యొక్క క్రోధమును గాంచి "జోన్" కనుకూలురగు ధర్మయాజకులును, "అసెసరు"లును విచారణాలయము విడిచిరి. మరి తమ పదవులనుకూడ త్యజించి జోనుకు సహాయముచేయ నిశ్చయించిరి.

"కచను" జహాన్ లోహియక్ అను ప్రసిద్ధిచెందిన వకీలునకు విచారణకు సంబంధించిన కాగితములన్నింటిని జూపించెను. ఆవకీలా కాగితములన్నింటిని బరిశీలించి కచను యొక్క విచారణపద్ధతి దోషయుక్తమని ప్రతికూలమతమును ప్రకటించెను. ఇట్టి సుప్రసిద్ధవ్యవహారదక్షుడగు వకీలుని ప్రతికూలమతమును గాంచి కూడ దన ప్రయత్నమును విరమింపజాలకపోయెను. ఇప్పటివరకు విచారకుల ప్రశ్నలకు జోను ఇచ్చిన ప్రత్యుత్తరముల యాధారమున ఒకకోటబుద్ధి వ్యవహారకుని సహాయమున గొన్నియభియోగములను క్రోడీకరించెను. "కచను" యొక్క మనోనీతఅసెసరులుకూడ జోనుకు విరుద్ధముగ దమ తమ యభిప్రాయములను ప్రకటించిరి. ఇందువలన నతని సంకల్పసిద్ధికి విఘ్నము లేకపోయెను.

తరువాత నీష్టరు పర్వమునకు బూర్వవారమున జోను వ్యాధిగ్రస్తయాయెను. ఈవారపు టాదివారమున ధర్మమందిరోపాసనలో యోగమిచ్చుటకై యామె హృదయమధిక వ్యాకులత జెందెను. ఆమె యట్టి పర్వదినమునగూడ పాషాణప్రాచీర వేష్టితఅంధకారమయ నిర్జన కారాగారమునందే బంధింపబడి యుంచబడెను. సోమవారముకూడ గడచినది. అయినను కారాగారద్వారముమాత్రము తెరువబడలేదు. మరల మంగళవారమున నామె విచారణాలయమునకు రప్పింపబడెను. ఈ సమావేశమందు కచను ఆమె యభియోగమును గూర్చిన వివరములన్నియు జదివి వినిపించెను. విచారకులు ఆమె పురుషవేషధారణవిషయమున నిట్లు చెప్పిరి. "జాతిగత వేష భూషణములను, ఆచారవ్యవహారములను త్యజించువారు ధర్మానుసారముగ దోషులుగను, ఈశ్వర దృష్టియందు పాపులుగను యెంచబడుదురు."

జోను రమణియైయు కూడ దన జాతీయవేషభూషణములను త్యజించి పురుషోచితవేషమును ధరించెనను విషయమే విచారకులకు ముఖ్యాపరాధముగా గానుపించెను. విచారకుల యీ సిద్ధాంతము ఆసమయమందలి సాంఘికమందును, అనుభవజ్ఞుల సంకీర్ణతయందును, ధర్మశాస్త్రముల మూలతత్వములయందును నాటికిగల యుదాసీనతను బాగుగ బ్రకటముగుచున్నది. జోను ఈ సిద్ధాంతమును గూర్చి తొలుత నేమియు

బలుకకున్నను చివరకు యీ విషయమున యథార్థమును వచించుటకై గడువొకదినంబును కోరెను. కాని యామె ప్రార్థన యంగీకరింపబడకపోవుటచే నా నిట్లు నెప్పెను.

"నే నీవేషము నెప్పుడు త్యజించెదనో నిశ్చితముగ జెప్పజాలను."

పురుషవేషమును త్యజించకపోవువిషయమున రమణీసహజలజ్జచే విచారకులయెదుట నామెచెప్పజాలకపోయెను. కాని కారాగారమున నామెతో ప్రతివ్యక్తియు నిష్ఠురవ్యవహారము సల్పుటయే యిందుకు గారణము. ఆ నిష్ఠురవ్యవహారవివరములు వెనుకటిప్రకరణములోనే చెప్పబడినవి.

ఇచట జోను వ్యాధిగ్రస్త యాయెను. వ్యాధిపీడితయై యుండగనే యీస్టరుదినములయందామె యన్యభక్ష్యములతో "బిషప్" వలన బంపబడిన మత్స్యాదులనుకూడ భుజించెను. ఇందువలన నామె యింకను వ్యాధిపీడిత యయ్యెను. ఆ సమయమందలి యామె శరీరస్థితి యెంతయు శోచనీయప్రదర్శనము. ఆమెను మరణింపజేయు నుద్దేశమున విషపు మత్స్యాహారమున విషమును ప్రయోగించె నని అధికసంఖ్యాకులు తలంచిరి. ఈ ప్రజలసంశయమును విని ఎరల్ ఆఫ్ వార్విక్ (Earl of Warwick) అను నతడు ఆమె నీ విధముగ మరణింపనీయ మనియు నే విధముగానైనను స్వస్థపరచెదమనియు ప్రకటించెను. అరల్ యను సుప్రసిద్ధవైద్యశిఖామణి

ప్రయత్నమునను అన్యచికిత్సకులసహాయమునను జో నెట్లో స్వస్థపడెను.

జోన్ క్రిమక్రిమముగ యథార్థస్థితిని పొందసాగెను. అయిన నింకను తల్పమునుండి శిరము నెత్తజాలని దుర్బల స్థితియందుండెను. ఇట్టిస్థితియందే 1431 వ సంవత్సరము ఏప్రియల్ 18 తారీఖున రోగక్లిష్టశరీరయై అవసన్నచిత్తమున నిర్జన కారాగారమందలి యొకమూల పడియున్న జోనును హృదయహీనులగు విచారకులచటికి వచ్చి యపరాధమును స్వీకరించి యాత్మసమర్పణ కంగీకరింపు మని బాధింపదొడగిరి. ఎందుచేత నన నామెను ధర్మద్వేషిణి యని నిరూపింపగలిగిన నామెకు సహజమరణశిక్ష నియ్యగలరు. కాని జోను తన సహజనిశ్చలతను మాత్రము వీడజాలకపోయెను. ఆమె యెవ్విధముగను తాను ధర్మద్వేషిణి నని యొప్పుకొనకపోవుటచే వారెంతయు గ్రుద్ధులై జోనును భయపెట్టుచు నిట్లు చెప్పిరి.

"నీవు మాయాదేశానుసారము సంచరించుట కిచ్చగించనియెడల నిన్ను నానావిధముల గష్టపెట్టి ధర్మద్వేషిణి వని ప్రకటించి మృత్యుగహ్వరమున బడద్రోయుదు మని నమ్ము ము."

రుగ్ణబాలిక క్షీణకంఠమున దృఢతాపూర్వకముగ నిట్లు ప్రత్యుత్తరం బిచ్చెను.

"నేను నిజమైన క్రైస్తవరమణిని. యథావిహితముగా క్రైస్తవధర్మమునందు భక్తి విశ్వాసములు కలిగియుంటిని. కాన నిజమైన క్రైస్తవభక్తునివలెనే మృత్యువు నానందముతో నాలింగనము చేయ సంసిద్ధనై యుంటి."

తమపరి మే రెండవ తారీఖున ధర్మయాజకు డొకడు మరల నామెయొద్దకు వచ్చెను. అతడు కూడ నామెతో ధర్మ మందిరాధికారుల సముఖమున నాత్మసమర్పణ చేయ నిచ్చగింపు మనియే నుడివెను. జోను యీమారుకూడ దృఢముగ జవా బిచ్చెను.

"ఎవడు స్వర్గమునకును మృత్యులోకమునకును విధాన కర్తయో అతనిసముఖముననే నేనాత్మసమర్పణము చేసెదను."

ధర్మయాజకు డామె యీ వాక్యము నాలించి యసంతుష్టుడై మరల నిట్లు చెప్పెను.

"అట్లైన మేము నిన్ను బ్రతికీయుండగనే కాల్చి చంపెదము. నీకు శారీరకశిక్ష విధించువరకు నీవు మాచెప్పు విధమున సంచరింపవు."

మరల మే 11 వ తారీఖున వా రందరు కారాగారమున కేగిరి. వారు పూర్వవిధముగనే భయముచూపుచు నిట్లు చెప్పిరి.

"జోన్! ఇప్పుడైనను తోవకు రమ్ము. లేనియెడల పలుకష్టము లనుభవింపవలసివచ్చును."

జో నెంతమాత్రము భయపడక వీరోచితముగ: పౌరుషోత్సాహములతో నిట్లు చెప్పెను. "ఈశ్వరుడే నా జీవితమున కేకమాత్రనియంతయై యున్నాడు. నే నతనినే విశ్వసించుచున్నదానను. మీ రొక వేళ నా శరీరమును ఖండఖండములు చేయుచున్నను నే నెంతమాత్రము భయపడను."

జోనుయొక్క యీ వీరోచితప్రత్యుత్తరమువలన "కచను" యత్నము లన్నియు విఫలము లాయెను. ప్యారిస్ నగరవిశ్వవిద్యాలయాధికారులు యీ విచారణయొక్క ప్రాథమికనివేదికను పఠించి జోనుకు ప్రతికూలాభిప్రాయ మిచ్చిరి. మఱియు కచనుయొక్క విచారణపద్ధతి నెంతయు ప్రశంసించిరి. విశ్వవిద్యాలయాధికారుల యనుకూలాభిప్రాయమును పొంది కూటనీతిజ్ఞులగు విచారకులును, "అసీసరులు" ను, జోనునుజీవించియుండగనే కాల్చిచంప నిశ్చయించిరి. కాని యిందువలన నెంతమాత్ర మాంగ్లేయప్రభువు సంతసింప లేదు. ఎందుచేత నన జోన్‌వలన స్వీకారోక్తి నొకదానిని వ్రాయించి దానివలన నామెను ధర్మద్వేషిణిగ నిరూపించి మరణశిక్షవిధించుటయు ఫ్రెన్సు రాజగు చార్లసు ఒక ధర్మద్వేషిణి యగు బాలికానాయకత్వమున యుద్ధముచేసి జయము పొందెనని ప్రకటించి యతనిని నాగరకతాప్రపంచము నెదుట

హీనునిగ నెంచబడజేయుటయే వారి ముఖ్యోద్దేశమై యుండెను. ఇంకువలన నాంగ్లేయులు జోనుచే స్వీకారోక్తి వ్రాయించుటకై చతురుడగు మరియొక ధర్మయాజకుని నామె కడకు బంపిరి. కాని జో నతనితోకూడ నిట్లే చెప్పెను.

"న న్నొకవేళ యజ్ఞకుండమున బడద్రోసినగూడ నేనిది వరకు నుడివిన విధముగనే దృఢచిత్తనై యుందును."

ఈవిధముగా జోనువిషయమున అంతిమపరిపర్తన మెంతమాత్రము గాంచజాలక కార్డినల్ (Cardinal of Winchestar) అస్థిరుడాయెను. జనసాధారణమందుగూడ జోను యం దొకవిధమయిన సానుభూతి కలుగజొచ్చెను. ఇందువలన "కార్డినల్" యికముందు విచారణను గుప్తస్థలమునందే చేయ నిశ్చయించెను. ఇందుకొరకు మే 23 వ తారీఖున "రాయన్" నగరమందలి ప్రసిద్ధధర్మమందిర సమీపస్థమగు నొక గొప్ప మైదానము నేర్పరచిరి. కార్డినల్ స్వయముగనే యచటకు హాజరాయెను. విచారకులు, ధర్మయాజకులు, అఫీసరులు మరియు వ్యవహారదక్షులు నగువారు విచారణను గాంచుటకై యచ్చోటికి విచ్చేసిరి. విచారణారంభమునకు పూర్వము "కచను"పక్షీయు డొకడు జోనుకడ కేగి యిట్లు చెప్పెను.

"జోన్! ఇప్పుడుకూడ సమయము కలదు. మాయుపదేశానుసారముగా నీవు కేవల మొక స్వీకారోక్తిపత్రము

నందు మాత్రము హస్తాక్షరము లంకితముచేయునెడల మేము నిన్ను నిశ్చయముగా నాంగ్లేయులహస్తములనుండి తప్పించి ధర్మమందిరములయం దుండ జేసెదము."

ధర్మమందిరములయం దుంచెద రని విని యాంగ్లేయుల హస్తములనుండి విముక్తిపొందుటయే యుత్తమ మని తలచి యందుల కియ్యకొనెను. కాని యామె వ్రాయుట యనిన నేమొ యెఱుగకుండెను. ఇందువలన నామె వారిచ్చిన కాగితమునందు దన వ్రేలిముద్ర నంకితము చేసెను. ఆంగ్లేయుల కోరిక సఫలీకృత మాయెను. కాని జోను యేయాశచే అంగీకరించెనో, అది శీఘ్రమే స్వప్నప్రాయమాయెను. ప్రధాన విచారణాధిపతియును, ఫరాశీయుడు నగు "కచన్" దేశద్రోహియు, సంఘద్రోహియు, ముఖ్యముగ జాతిద్రోహియు కూడనై బానిసత్వమే యున్నతపదవియని తలచి దండనాజ్ఞను వినిపించుటకై లేచి యిట్లు చెప్పదొడంగెను

"జోన్! ఏకారాగారమునుండి వచ్చియుంటివో యచ్చోటికే మరలిపొమ్ము. మరియు స్వయంకృతపాపమునకు ప్రాయశ్చిత్తస్వరూపమగు మృత్యువును పొందువరకు అనుతాపమున దినములు గడపుము." ఈ ప్రతారణాజ్ఞను అనగా విశ్వాసఘాతపూరితమగు దండనాజ్ఞను విని జో నెంతయు నిరాశ జెందెను. ఏపశుబలసాంగ్రామికకర్మచారుల హస్తములనుండి యాత్మగౌరవమును రక్షించుకొనుటకై యామె

యనిచ్ఛతోనే యీ విధముగా స్వీకారోక్తి చేసెనో మరల వారి యధీనముననే యుండి దినములు గడుపవలసి వచ్చునని యెఱిగి యామె యదేసమయమున దన యంగీకారోక్తిని పురస్కరించుకొనెను. ఇందువలన సైనికులయందొక యుత్తేజము వ్యాపించెను. విచారించువారలు కూడ నొక గొప్ప కఠినసమస్యయందు గూలిరి. కాన నాదినమున విచారణ నాపి జోనును కారాగారమునకు బంపిరి.

ఆనాటిరాత్రి జోను యథాప్రకారముగా పగటి దుస్తులను విడచి రాత్రిదుస్తులను ధరించి తనగదికి శయనింప బోయెను. అప్పుడు కర్మచారు లామె విడచిన పురుషోచిత వస్త్రములను తీసి స్త్రీలు ధరించు దుస్తుల నుంచిరి. ఇందువలన మరుదినమునం దామె వివశయై స్త్రీ దుస్తులనే ధరింపవలసి వచ్చెను. రెండవదినమున మరల వారా స్త్రీదుస్తుల తీసి పురుషోచితవస్త్రములనే యుంచిరి. ఉదయముననే లేచి యామె చూడగా వస్త్రములు మార్చబడియుండెను. మరల నామెపురుషులదుస్తులనే దాల్చి పురుషవేషముననే యుండెను. ఇందువలన వారి యభీష్టసిద్ధిపథము సరళమయ్యెను. ఎందుచేతనన క్రైస్తవధర్మానుసారముగా నిట్టి వ్యవహారము చేయువారలు దోషులుగ నెంచబడుటచేగాక మరణశిక్షకు యోగ్యులయ్యెదరు. ఇందువలన రెండవ దినమున ధర్మాధ్యక్షు డగు

"కచన్" ప్రతినిధులు, అసీసరులు కారాగారమున జోన్‌ను కలియ నేగిరి. వారిని గాంచి జో నిట్లు చెప్పెను.

"రెండవ వస్త్రము దొరకకపోవుటచేతనే నేను మరల పురుష వేశమున నుంటి. నే నిప్పుడుకూడ నీ వేషమును త్యజింప సిద్ధముగా నున్నాను. నన్ని కారాగారమునుండి ధర్మమందిరమునకు బంపుడు" కాని యామె యీమాట లెంతమాత్రమును వారి శ్రవణేంద్రియముల జొరబడజాలక పోయినవి.

# అగ్ని కుండము

## జో[illegible]

## —* విచారణాంతము - మరణశిక్ష *—

మే 29 వ తారీఖున కచను "రేపు ధర్మద్వేషిత్వాపరాధమున జోనుయొక్క సజీవశరీరము అగ్నికాహుతి చేయబడు"నని ప్రకటించెను. రాయన్ నగరమందలి యొక పురాతనవీధియందు వధ్యస్థానము నేర్పరచిరి. మే 30 వ తారీఖున ఉదయము 9 గంటలసమయమున జోను రమణీ వేషమున వధ్యభూమికి దీసికొని రాబడెను. అచట మూడు మంచెలను సిద్ధపరచిరి. అందొకదానియందు ఇంగ్లాండు రాజ్యసింహాసనాధిపతియు, రెండవదానియందు ధర్మాధ్యక్షుడగు "కచను" ప్రధానప్రతినిధులును, అసీసరులును ధర్మయాజకులు నుపవిష్టులైయుండిరి. మూడవమంచె మంటనటువంటి యింధనములతో సమకూర్పబడి యుండెను. దానియందు ఒక పొడవగు కఱ్ఱతో వీరబాలిక యగు జోన్ ఆఫ్ ఆర్క్ నిలబెట్టబడి యున్నది. ఆమె శరీరమంతయు నినుపగొలుసుతో బంధింపబడి యుండెను. ఆమె శిరమునకు పైగా నొక చెక్కమీద 'స్వధర్మత్యాగిని' 'స్వధర్మద్వేషిణి' అను శబ్దములు వ్రాయబడియుండెను,

ఒకపురోహితమహాశయుడు ప్రథమమున యథారీతిగ నుపాసన ముగించి జోనుతో నిట్లు చెప్పెను.

"జోన్! ఇక వెడలుము. శాంతిపూర్వకముగ నీలోకమును త్యజించుము. నీవు స్వధర్మత్యాగినివి. ఇందువలన మేము నిన్ను రక్షింపజాలము."

జోను హస్తముల జోడించి నిమీలితనేత్రయై కొంత తడవు యీశ్వరు నారాధించెను. తదుపరి యామె యచ్చోటి జనసామాన్యమును సంబోధించి యిట్లు చెప్పదొడంగెను.

"తమరందరు నా యాత్మకళ్యాణమునకై సర్వేశ్వరుని బ్రార్థింపుడు."

ఆమె శత్రువులుకూడ నామె యావేగముతో నుడివిన యీ శబ్దములను విని తమతమకన్నీటి నాపజాలకపోయిరి. దేశద్రోహియగు "కచన్" యొక్క లజ్జారహితనేత్రముల నుండికూడ కొన్ని కన్నీటిబిందువులు నేలరాలెను. తరువాత నతడు కన్నీటిని తుడిచికొని దండనాజ్ఞ నిట్లు వినిపించెను.

"నీవు సైతానువలన ప్రేరితవై అపకర్మ లనేకములు చేసియున్నావు. ఇందువలన నిన్ను స్వధర్మత్యాగినిగ నెంచి మరణశిక్షను విధించుచున్నాము."

# అంతిమ
# దృశ్యము

—* వీరాంగనయొక్క ఆత్మత్యాగము *—

వీరబాలిక మృత్యువనివార్యమని తెలిసి భగవంతునికి దనను విడిచెను. అది మధ్యాహ్నసమయము. మధ్యాహ్నమందలి యెండవేడిమిచే సమస్తపృథ్వి యుత్తప్తమైయుండెను ఇదే సమయమున జోన్ నిలబడియున్న కర్రల కుప్పకు సైనికుల యాజ్ఞానుసారముగ ఘాతకు లగ్నినంటించెను. చూచుచుండగనే అనలుడు భానునిసహాయమున సంహారమూర్తియై వీరాంగనాశరీరమును దాకెను. జోను ప్రథమమున శంకితయై దాహము దాహ మని యరచెను. కాని మరుక్షణమందే యామె యా దుర్బలతను వీడెను. ఆమె హృదయమునందొక నవీన తేజోబలము సంచరింపనారంభించెను. ఆమె మానవదేవివోలె యిట్లు చెప్పెను.

"నిశ్చయముగ నేను మోసగింపబడలేదు. నే విన్న వాణి నిజముగ భగవద్వాణియే యైయున్నది."

ముహూర్తమాత్రమున విశ్వధ్వంసి యగు అనలశిఖ క్షణజన్మయగు దేవబాలయొక్క పుణ్యపూతశరీరమును భస్మీభూత మొనర్చెను.

# ఉపసంహారము

## —* ఆత్మోత్సర్గఫలము *—

తపస్వినియగు వీరాంగన జన్మభూమిని "స్వర్గాదపి గరీయసి" అని తలచి పూజించెడిది. స్వజాతిని ప్రాణములకంటె నధికముగ ప్రేమించెడిది. రాజునందు దేవతంబోలె భక్తినిగలిగి యుండెడిది. స్వదేశముకొరకును స్వజాతికొరకును సమ్రాట్ కొరకునునై యామెతన జీవితమందలి ఉషఃకాలముననే స్వాతంత్ర్యదేవీమంగళమయమందిరమున చిరునవ్వొలుకుచుండ నాత్మదానము చేసెను. ఆ యాజన్మపవిత్రవీరలలనయొక్క అపాపస్పర్శదేహముయొక్క పవిత్రరుధిరధారవలన దేవీమందిరము రంజితమాయెను. బహుదినములనుండి కూడియున్న పాపకళంకమంతయు నంతమొందెను. మరి పరాధీనమలినము దూరమాయెను. విధాత యింగితమువలన పూనిన మహావ్రతమామె భోగవాసనలను త్యజించి పార్థివస్నేహములనుండి విడివడి దృఢవిశ్వాసమున పూర్తిచేసెను. అర్లింసునగరమును విదేశీయదాస్యశృంఖలములనుండి విముక్తిని పొందించి సామ్రాట్టును రాజసింహాసనమున ప్రతిష్ఠించి జన్మభూమియొక్క స్వాతంత్ర్యపథమును సరళమొనర్చుటయే యామె జీవనవ్రతము. ఇదియే విధాతయిచ్చిన యాదేశవాణి. ఆమె నిష్కామనిస్స్వార్థభావములతోడనే ఆదివ్యదేవవాణి యాదేశమును పాలించెను. ఆమె

తన జీవితమందే జన్మభూమిని చాలవరకు శృంఖలాముక్తగా జూచి మరి యిహలోకమును వీడెను.

డిష్లాలీ నామకు డగు అర్థపిశాచ మనదగు దేశద్రోహియొక్క విశ్వాసఘాతుకత్వమువలనను మరి యతని పడయంత్రములమూలమునను జోన్ శత్రుహస్తగతయాయెను. బహుదినములవరకు నానావిధకష్టము లనుభవించినమీదట అగ్నికాహుతి చేయబడెను. ఆమె మిథ్యాశరీరము అనలకుండముయొక్క జ్వాలామయశిఖవలన భస్మీభూతమాయెను. వీరాంగనయొక్క స్మృతిపూజయొనర్చి ఫరాసీయజాతి స్వదేశప్రేమవలన మరల యెక్కడ సజీవమానో యను భయంబున ఇంగ్లాండుయొక్క ప్రధానధర్మాధ్యక్షుని (Cordinal of Winchester) ఆదేశానుసారముగ జోనుయొక్క చితాభస్మముకూడ నదీజలంబున గలిపివేయబడినది. ఏ యమితతేజశ్శాలినియగు వీరబాలనయొక్క యలౌకికసామర్థ్యమువలన నాంగ్లేయుల వీర్యవహ్ని తేజో విహీనమాయెనో, యెవరి ప్రేరణవలన ఫరాసీయజాతి జాగ్రత్తనొందెనో, యెవరియాత్మత్యాగమువలన విశ్వజగత్తు స్తంభితమాయెనో ఆశత్రురమణియొక్క స్మృతిశేషనిదర్శనముకూడ పృథివీతలమునుండి విలుప్తము చేయుటయే యుచితమని యాంగ్లేయులు తలచిరి. ఇందువలననే వీరాంగనయొక్క పవిత్రశ్మశానక్షేత్రపు భస్మరాశిరూపక పుణ్యస్మృతి చిహ్నమును

కూడ వారుండనీయకపోయిరి. కాని చితాభస్మముతోనే ఆదర్శజీవనస్మృతి యంతరించునో జగత్తునందు ఆత్మత్యాగమునకు ఫలమే లేకుండును. ఒకానొక ఆంగ్లమహాశయుడే ఆత్మత్యాగమహిమను కీర్తించుచు నిట్లు చెప్పెను:—

"The martyr may perish at the stake, but the truth forwhich he dies may gather new lustre from the sacrifice. The patriot may lay his head upon the block, and hasten the triumph of the cause for which he suffers. The memory of a great life does not perish with the life itself but lives in other minds."*

ధర్మ సాధులు మరణశిక్షవలన నష్టమయ్యెదరు. కాని యే సత్యముకొఱకు ప్రాణములను ద్యజించుచున్నారో అది ఈ యాత్మోత్సర్గప్రభావమువలన నవప్రభతో మండితమగుచున్నది. దేశభక్తుడు వీరఖడ్గమునకు దన శిరము నిచ్చుచున్నాడు కాని యతడే కార్యసాధనకొఱకు ఆ శిక్ష ననుభవించుచున్నాడో అది యీ విధముగా శీఘ్రముగనే సిద్ధిచెందును. ఒక మహాపురుషుని స్మృతి యతనిజీవితముతో నశింపదు. కాని యన్యహృదయములయందు మాత్ర మది వికసించుచుండును.

* See Duty by Smiles, Chapter V pp 94.

౨

## —* సంపూర్ణఫ్రాన్సుకు స్వాతంత్ర్య ప్రాప్తి *—

పరవర్తితమగు ఫరాసీయజాతియొక్క 22 వ త్సరముల చరిత్ర నవలోకించిన చో నుపయుక్తపాశ్చాత్య ద్వాంసులయొక్క యీ జ్ఞానపూర్ణమగు నుక్తి సంబంధమగు త్యము విశదమగును. జోను ఫ్రాన్సుయొక్క భిన్నభిన్న గరముల నుద్ధరించెను. ఆంగ్లేయులప్రధానసేనాపతులను ముద్ధమునం దోడించి జన్మభూమియొక్క పవిత్రాంగమునుండి ాస్యశృంఖలములను విడివడజేసెను. కాని విదేశీయుల ామె యచ్చోటునుండి యొక్కసారిగ పారద్రోల ాలకపోయెను. సమస్తదేశమును దాస్యవిముక్తి యొనర్చుట ామెయొక్క విధాతనిర్దిష్టవ్రతము గాదు. ఆమె కేవలము ్వాతంత్ర్యదేవతయొక్క మంగళమయమందిరమున ప్రాణ ్రతిష్ఠ నొనర్చి స్వజాతియొక్క ముక్తిపథమును నిష్కంటక ొనర్చి వెళ్లుటకే యీశ్వరాదిష్టమై కర్మక్షేత్రమునం దవ ర్ణయాయెను. ఆసమయమునగూడ ఫ్రాన్సునం దాంగ్లేయు ంకను నధికారము చెలాయించుచుండిరి. నార్మండీ, ప్యా స్, పైంటేజి మొదలగు ముఖ్యపట్టణములయందు గూడ ాంగ్లేయుల జయభేరియే ప్రతిధ్వనించుచుండెను. ఇంకను ా రెల్లెడల దుర్గముల నిర్మించుచు దమ నిరంకుశాధికారము ను నిర్విఘ్నముగ గొనసాగించుకొనుటకు దృఢప్రయత్నము

లొనరించుచుండిరి. కాని విధివిధానమువల్ల వారి చేష్టలన్నియు వ్యర్థము లాయెను. జాతీయదుర్దినములందుకూడ రాజులందును ప్రజలందును, సామంతులందును, అంతర్విప్లవముల కంతము లేకుండెను. కాని వీరాంగనయొక్క యాత్మోత్సర్గానంతరము అనగా 1431 నుండి 1440 వరకుగల నవవర్షములలోనే ఫ్రాన్సు యొక్క రాజ్యనైతికగగనమున విధాతయొక్క కృపచే సుఖశాంతిపూరితమగు వాయువు వీవసాగెను. ఇందువలన ఫరాసుల యాంతరంగిక మనోమాలిన్య మంతరించెను. ఫ్రాన్సుసామంతగణము గృహకల్లోలములను మరచిరి. మరియు నందరును రాజును కలిసిరి. సమస్త ఫరాసీయ జాతియు తమజాతియందలి యాలోకనమును గ్రహించిరి. విచ్ఛిన్నులగు దేశీయుల యీ శుభప్రిదమిలనము ప్యారిసు నుండి యాంగ్లేయులను తరిమెను. ఫ్రాన్సురాజ్యమందలి యొక ముఖ్యపట్టణమున నాంగ్లేయులకు గల ఆధిపత్యము చిర కాలమునకు విలుప్తమాయెను. ఫ్రాన్సుయొక్క రాజనైతిక గగనమున నుదితుడగు స్వాతంత్ర్యభానుని జ్యోతిర్మయ కిరణ జాలమువలన పరరాష్ట్రీయ ప్రభుత్వ మలిన మంతమొందెను.

ఈ జాతీయ మిలనానంతరమునుండి యన్నివిధముల కల్యాణములకు సూత్రపాతమాయెను. తరువాత 1440 నుండి 1453 వరకు ఫరాసీయరాజగు సప్తమచార్లిసు రాజ్యము నన్ని విధముల సంస్కరించెను. అతడు శాసనవిభాగములను సాంగ్రా

మిక విభాగములను భిన్నవిధముల నభివృద్ధిచేసెను. ఈ యభి వృద్ధిబలమున రాజకార్యములు క్రమబద్ధమాయెను. ఇందు వలన ఫ్రాన్సుదేశీయశక్తి యినుమడించెను. ఇక్కారణమున నాంగ్లేయు లధికదినము లచట నుండజాలకపోయిరి. వారిశక్తి క్రమముగ క్షీణించుచుండెను. మరియు 1453 వ సం॥ లో వా రా దేశమునుండి తరుమబడిరి. ఫ్రాన్సుపాదములనుండి విదేశీయ దాసత్వ శృంఖలములు వెడలింపబడినవి. జోను యొక్క ఆత్మోత్సర్గమువలన పతితస్వదేశ వాసులయందు ఏ అక్షయశక్తి సంచలించెనో దాని ఫలముననే ఫ్రాన్సు స్వాధీనతా దేవియొక్క మంగళమందిరమున బ్రతిష్ఠిత మాయెను. మరియు ఫ్రాన్సురాజ్యము పరాధీనత యను నాగపాశము నుండి విముక్తమై యపూర్వస్వర్గరాజమున పరిణితమాయెను. మరియు ఫరాసీయ జాతియందు దేవోచిత సౌభాగ్యభాను డుదయించెను.

## 3

### —* దేవీ స్మృతి పూజ *—

1429 వ సంవత్సరములో జోను కారాగారమునం దుంచబడినప్పుడు ఫ్రాన్సురాజును ప్రజలును ఆమె ముక్తి కొఱ కెంతమాత్రమును ప్రయత్నము సలుపక యూరకుం డిరి. పతితజాతియొక్క యుదాసీనతకు ప్రమాణము లితివా

షములం దెన్నియో కలవు. స్వాతంత్ర్యప్రాప్తి యనంతరము ప్రజలును రాజును స్వర్గీయవీరాంగనాస్మృతి పూజకై నానా విధముల సంయోజనము సలిపి పూర్వకృతపాపములకు ప్రాయశ్చిత్త మొనర్చుకొనిరి.

వీరబాల మరణానంతరము 19 వత్సరములకు 1449 సం లో రాజు రాయన్ నగరమును ఆంగ్లేయులనుండి వశపఱచుకొనినపుడు అత డన్నిటికంటె ప్రప్రథమమున అన్యాయ విచారకుల పాపానుష్ఠానముల గూర్చి యామూలవృత్తాంతమును సంగ్రహించుటకై యొక ప్రతినిధిని నియుక్తము చేసెను. ఆసమయమున విచారణయందు పాల్గొనినవారందరి సాక్ష్యములు తీసికొనబడినవి. తరువాత నీయనుసంధానమును గూర్చి లిఖితవివరణములు అనేక విద్వాంసులకును, వ్యవహారదక్షులగు సజ్జనులకును చూపించి వారియభిప్రాయము లడుగబడెను. జ్ఞానులగు వ్యక్తు లనేకులు బాగుగ నాలోచించి వీరాంగనా సంబంధమగు విచారణాపద్ధతిని దోషయుక్తముగ నిర్ణయించిరి. మఱియు నాన్యాయదండనాజ్ఞను న్యాయవిగర్హితమనియు నియమవిరుద్ధ మనియు జెప్పిరి॥ రాజు ఏవంవిధానుకూలాభిప్రాయమును పొంది సంతుష్టిజెందెను. అతడు సర్వసామాన్యుల యెదుట పూతచరిత్రయగు వీరాంగన నిర్దోషియని ప్రమాణముచేయు టావశ్యకముగ దలచెను. ఇందుకొఱకు ప్రధాన ధర్మయాజకులను నియమిం

చెను. చివరకు 1456 వ సం॥ జూలై 7 వ తారీఖున రాజ్య మందలి ప్రసిద్ధ ధర్మనిష్ఠాగరిష్ఠులును, ధర్మమందిరాధ్యక్షులును రాయనునగరమందలి ధర్మమందిరమున సమావేశమై యిట్లు ప్రకటించిరి.

జోనుకు విరుద్ధముగ ధర్మద్వేషిణి, పిశాచిని యని నడుపబడిన యభియోగము మిథ్యయు విచారణాపద్ధతి భ్రాంతిమూలకమును దండనాజ్ఞ న్యాయవిరుద్ధమునై యున్నవి. ఎవరు వీరాంగనను సమర్పించి దేశద్రోహాపరిచయము నొనర్చిరోమ రెవరు అవిచారణకార్యమున సహాయచేసి ఘోరతర పాపానుష్ఠానముచేసియున్నారో వారందరును దేశద్రోహులైయున్నారు.

రాయనునగర మందలి ఏమందిరమునం దుపవిష్టులై శత్రువులా వీరాంగనకు దండనాజ్ఞను విధించిరో ఆ మందిరముననే నేడు 26 వత్సరముల యనంతరము ఫ్రాన్సుయొక్క ప్రసిద్ధ ధర్మయాజకులా దండనాజ్ఞను న్యాయవిరుద్ధముగ నిరూపించి ప్రకటించిరి.

వీర్యవతియగు వీరాంగన యలౌకిక సాధనాశక్తివల సన్లింసనగరమును పరాధీనత యను నాగపాశమునుండి విముక్తి ప్రసాదించి సమగ్ర ఫ్రాన్సుయొక్క స్వాతంత్ర్య పథమును నిష్కంటక మొనర్చెనని యిదివరకే నుడివియుంటిమి. కాబట్టి ఆమె దేశవాసులు కృతజ్ఞతానిదర్శనస్వరూ

పముగ నామె వృద్ధజననియొక్క పాలనపోషణకై యొక
దానము నీయ నిశ్చయించిరి. 1438 సం॥లో ఆదాన మామె
మరణపర్యంతము సుఖముగ ననుభవింప నీయబడెను. తదు
పరి 1458 సం॥లో ఆమెజనని జ్వరగ్రస్తయై పరలోకప్రాప్తి
చెందెను. అనంతరము ఫ్రాన్సువాసు లనేక స్థానములయందు
వీరాంగనావిగ్రహములు ప్రతిష్ఠించి స్మృతిపూజ లొనర్చిరి.
రాయను నగరమున నే స్థానమం దామె యనలుని జ్వాలా
మయ శిఖవలన భస్మీభూతమాయెనో ఆస్థలమునందే యామె
స్వర్గతాత్మ సన్మానమునకై ఆవీరాంగనయొక్క శిలావిగ్ర
హము స్థాపింపబడినది. నేటివర కా పవిత్రశ్మశానభూమి దేవీ
జోన్ నామమున విఖ్యాతిజెంది యుండెను.

1429 వ సంవత్సరము మే 8 వ తారీఖున వీరాంగన
యర్లింసు నగరమును విదేశీయులనుండి విడిపించి స్వాతంత్ర్య
మంత్రము నుపదేశించి యుండెను. నగరవాసులు పరలోక
గతయగు వీరబాలస్మృతికై ప్రతివత్సరమునం దాదినమున
నుత్సవము జరుపుచుందురు. ధర్మమందిరములందు విశేష
రూపమున నుపాసన చేయుదురు.

19 వ శతాబ్దాంతమున ఫ్రాన్సుయొక్క ధర్మమందిరా
ధ్యక్షులును, యాజకులును దేవీజోనును సాధు (Saints)
శ్రేణియందు అంకితముచేయు నభిప్రాయముకలవారైరి.
ఇందుకొఱకు 1903 సం॥ లో నొకతీర్మానము ప్రస్తావింప

బడెను. మరుసటివత్సరము జనవరి 6 వ తారీఖున వీరాంగ నకు సాధుపదవి నిచ్చిరి.* ఫ్రాన్సు సేనయందు వీరాం గనయొక్క పవిత్రస్మృతి నేటివరకును పూజింపబడుచున్నది. సశస్త్రసైనికులు జోనుయొక్క జన్మస్థానముకడనుండివచ్చుచు బోవుచు ససన్మానముగ నభివాదనముచేసి తేజస్వినియగు వీరలలనయొక్క స్వర్గగతాత్మ నభినందించెదరు. వీరపూజ కెట్టి సుందరపద్ధతి! పూజ్యులస్మృత్యర్చన కెట్టి నిదర్శనము!

## ౪

## —* వీరాంగననుగూర్చి మతామతములు *—

ఇప్పుడు మనము వీరాంగననుగూర్చిన యభిప్రాయము లను సమాలోచించి గ్రంథమును పరిసమాప్తిని బొందించెద ము. జోను ఇంగ్లాండుకు శత్రువు. మరియు నాంగ్లేయుల నోడించి యాంగ్లశక్తిని నష్టపరచినది. అయినను అనేకమంది విజ్ఞాన వంతులును ప్రసిద్ధిచెందినవారలు నగు నాంగ్లలేఖకులు యీ శత్రురమణివిషయమును పక్షపాతరహితముగ విమర్శించి తమ సత్యప్రియతను, ఉదారస్వభావమును పరిచయమొన ర్చిరి. ఎవరి యభిప్రాయములను విమర్శించుచుంటిమో వారిలో విశ్వవిఖ్యాతకవి షేక్స్పియర్ తప్ప అన్యులందరు జోన్‌ను

* See Encyclopadia Britannica Vol. XV Eleventh Edition.

సమాదరణపూర్వకముగ విమర్శించుచు నామె సద్గుణములను ప్రకటించిరి. టర్నర్ (Turner), గ్రీన్ (Green), మొదలగు ప్రసిద్ధఇతిహాస లేఖకులు పక్షపాతరహితులై యానమయ వివరములు వ్రాసిరి. విమర్శకశిఖామణియగు స్మైల్స్ (Smiles) పీరాంగనాసంబంధవిషయమును వర్ణించుచు తన సహృదయతాభావపరిచయము నిచ్చియున్నాడు. ప్రసిద్ధాంగ్ల కవియగు సౌథీ (Sauthey) మహాశయుడు యీవీరలలనయొక్క మహాగుణములపరిచయముబొంది స్వాగ్రుడై నిరపేక్షగా నుదార భావమున నామె మహిమను వర్ణించెను. అతడు తన "జోన్ ఆఫ్ ఆర్క్" అను కావ్యగ్రంథస్థభూమికయం దిట్లువ్రాసెను.

"It has been established as a necessary rule for the epic that Subject should be national. To this rule I have acted in direct opposition and chosen for the subject of my poem the defeat of the English. If there be any readers who can wish success to an unjust cause I desire not their approbation."

"మహాకావ్యరచనావిషయమున కావ్యవర్ణితవిషయమున జాతీయభావపరిపోషణ ముండవలెను అని యొక నియమము కలదు. కాని నేను ఈ నియమమునకు విరుద్ధ మాచరించితి. మఱియు నాంగ్లపరాజయమే నా కావ్యఇతివృత్తముగ రచించితిని. స్వదేశన్యాయవిరుద్ధాచారకుడ నని పాఠకులు

తలంతురనికూడ నే నెఱుంగుదును. నేను వారి యభిప్రాయా మోదకుడను ప్రశంసకుడను కాను."

ఆంగ్లకవియొక్క యీ కథనము నిజముగా మహాను భావత్వమునకు పరిచయము. ఆయన తన కావ్యగ్రంథమున ననేకస్థలములయందు జోనును మనఃపూర్వకముగ బ్రశంసించెను. మఱియు ఆమె యీశ్వరప్రేరిత యనియు నీశ్వరప్రతినిధి యనియు నామోదించెను. †

ఒక ప్రసిద్ధ జర్మనుకవి జోను జీవితమును విమర్శించుచు నిట్లు చెప్పినాడు.

"Who thirst now for thy blood will worship thee." అనగా - ఎవరు నీ రక్తపానముకొఱకు నేడు యిచ్ఛగలవారగుదురో వారే ఒకప్పుడు నీపూజ నొనర్తురు. కవియొక్క కథనము నిజముగనే ప్రకటరూపము దాల్చినది. ఏయాంగ్లేయు లొకదినమున దేవీరక్తపాతమున పృథ్వీతలమును కళంకితముచేయ నాతురులయి యుండిరో యా వంశీయులే యామె జీవనమును విమర్శించుచు నేడు స్మృతిపూజ యొనర్చుచుండిరి. కాని మహాకవి షేక్స్పియర్ యీ దేవబాల నెంతయు నవమానముగ జూచెను. అతడు తన నాటక మొకదానియందు పలుచోట్ల దేవీ జోనను 'భ్రష్ట' 'పిశాచిని' అని జఘన్యశబ్దములతో సంబోధించెను.

† See Robert Southey's Joan of Arc. Book II page 38 & Bock III page 50.

జోన్ ఒక అసదృశపవిత్రాత్మ, సాధుపిరాంగ. ఆమె నిట్టి అభద్రివాక్యముల సంబోధించుట కవియొక్క సంకీర్ణత్వమును, దారత్వమును ప్రకటమగుచున్నవి. ఇట్టి ద్వేషపూర్ణవాక్యములవలన నాదర్శజీవిత మెంతమాత్రము మలినభూయిష్ఠము కాజాల దని వేర చెప్పనేల? కాని యింకను ఉజ్వలమగు నని మాత్రము చెప్పవచ్చును.

ఫరాసీయవిద్వాంసులును సుప్రసిద్ధ ఇతిహాసలేఖకులునగు "లెమట్రొయిన్" "మిచీలెట్" మొదలగువారు పిరాంగనరొయొక్క పవిత్రజీవితమును వ్రాసి తమ స్వదేశప్రేమ పరిచయ మొనర్చిరి. మిచ్‌లెల్ మహాశయు [illegible] వ్రాసెను.

"Yes, whether considered religiously or patriotically, Jeanne D' Arc was a saint."

"స్వదేశహితైషి యేదృష్టితో చూచినను జోను సాధువని చెప్ప యోగ్యతగలిగియున్నది. మన భారతలేఖకులు కూడ నామెను ఫ్రిన్సుదేవి మొదలగు శబ్దములతో సంబోధించిరి. ఒక భారతీయ లేఖకుడు ఆమె దేశప్రేమను భగవాన్ బుద్ధదేవుని విశ్వప్రేమతో సరిపోల్చెను. *

---

* China in Asia and France in Europe, are the two countries that have best known how to make the public spirit into religion. This is the fact that made Joan of Arc a possibility. A peasant girl in a remote village could brood over the

ఆదర్శజీవితస్మృతి యెప్పుడును లుప్తముగాదు. దేశ విదేశములేకాక సమస్తజాతీయులచేతను "దేవీజోన్" పూజింపబడుటయె యిందుకు ప్రమాణము. దేవీ! నీజన్మ ధన్యము కదా! నీ స్వదేశప్రేమ ధన్యము! నీ రాజభక్తి ధన్యము! నీ భగవత్ప్రేమ ధన్యము! నీ యత్నము యథార్థరూపము దాల్చినది. కిశోరావస్థలోనే యే మహావ్రతమును గ్రహించి కర్మక్షేత్రమునం దవతీర్ణవైతివో! యౌవనాత్పూర్వమే ఆ మహావ్రతోద్యాపన సలిపి యమరలోకమునకు ప్రస్థానమైతివో! అట్టి నీ జీవితము ధన్యతచెందినది, ఆధర్శకమైనది, పవిత్రమైనది. నిన్ను గర్భమున ధరించిన పూజ్యమాత ధన్యతజెందినది. నిన్ను మాజాతి యని చెప్పుకొను గౌరవముపొందిన జాతి ధన్యమైనది.

---

sorrows of the country till she was possessed by the feeling that there was much pity in Heaven for the fair realm of France. An idea like this was like the compassion of a Buddha and nowhere but in France could it have been applied to the country.

(Nation making - in Karmayogin Vol. 1 No. 36)